

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ మంగళవారం 27-7-2021 RNI No.52865/93-Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 288 పేజీలు: 4 వెల: రూ.1/-

## అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు : కేటీఆర్



రాజన్న సిరిసిల్ల, జులై 26:(నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, కుటుంబాలకు అండగా ఉంటామని.. ఎవరూ అధైర్యపడొద్దని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ భరోసానిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నర్సింహులపల్లికి చెందిన టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బొంగురపు శ్రీనివాస్‌రెడ్డి.. కొద్ది రోజుల కిందట కరోనా మహమ్మారి బారినపడి మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి, ధైర్యం చెప్పారు. తక్షణ సహాయంగా రూ. 2లక్షల చెక్కును అందజేశారు. శ్రీనివాస్ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అన్ని వేళల కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. గ్రామానికి వచ్చిన మంత్రికి స్థానికులు పెద్ద ఎత్తున వినతిపత్రాలు అందజేశారు.

## ఎస్సీల ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 26:రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. దళిత బంధు పథకం అమలుపై హుజూరాబాద్ నియోజకవర్గంలోని దళిత ప్రతినిధులతో ప్రగతి భవన్‌లో ఇవాళ సీఎం కేసీఆర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ పథకం విధివిధానాలు, అమలు తదితర అంశాలపై వారితో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఎస్సీల భూముల సమస్యలను 10 రోజుల్లో పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు.

హుజూరాబాద్‌లో ఇల్లులేని ఎస్సీ కుటుంబం ఉండకూడదని, ఇల్లులేని వారి వివరాలను గుర్తించాలని చెప్పారు. ఖాళీ స్థలముంటే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందని చెప్పారు. 'హుజూరాబాద్‌లో రేషన్‌కార్డులు, పింఛన్లు సహా అన్ని సమస్యలు పరిష్కరించాలి. ప్రతి ఎస్సీవాడలో అధికారులు పర్యటించాలి. వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు గుర్తించి నివేదిక ఇవ్వాలి. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నుంచి కేంద్రం, ఇతర రాష్ట్రాలు చేర్చుకుంటున్నాయి. దళితబంధు పథకాన్ని కూడా ఇతర రాష్ట్రాలు అనుసరించాలి' అని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు.

## ఆర్థికాభివృద్ధి రంగాల్లో దళితులకు రిజర్వేషన్లు : సీఎం కేసీఆర్

హైదరాబాద్ , జులై 26:ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉండే రంగాల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు రిజర్వేషన్లు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దళితబంధు పథకాన్ని త్వరలో పైలెట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్‌లో ప్రారంభించనుండగా.. ఈ మేరకు నియోజకవర్గ దళితులు, ఉన్నతాధికారులతో సోమవారం ప్రగతి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా పటిష్టమైన నాడే వివక్ష నుంచి దూరమవుతారన్నారు. పథకంపై రాష్ట్రవ్యాప్తంగా దళితులకు అవగాహన కల్పించాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తే దళితుల అభివృద్ధితో పాటు రాష్ట్రాభివృద్ధికి దారులు వేస్తుందన్నారు. నైపుణ్యం, ప్రతిభ ఉన్న దళితవర్గాన్ని అంటరానితరం పేరుతో ఉత్పాదక రంగానికి దూరం చేయడం బాధాకరమన్నారు. మహిళలను జెండర్ పేరుతో అనుత్పాదక రంగానికే పరిమితం చేయడం తెలివితక్కువ పని అన్నారు. మనలో నిమిడీకృతమై ఉన్న శక్తిని గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

పట్టుదలతో స్వీయ అభివృద్ధికి పూనుకోవాలి

విజయం సాధించాలంటే దళారులు, ప్రతీప శక్తులను దూరంగా ఉంచాలన్నారు. దళిత మహిళ మరియమ్మ లాకప్‌డెత్ కేసులో దోషులుగా తేలిన పోలీసులను ప్రభుత్వం తొలగించిందని సీఎం కేసీఆర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రభుత్వమే స్వయంగా అండగా ఉన్నప్పుడు విజయం సాధించేందుకు దళిత సమాజం పట్టుదలతో స్వీయ అభివృద్ధికి పూనుకోవాలన్నారు. ప్రభుత్వ వర్గాలతో పని చేయించుకునే క్రమంలో ఇవాళ సదస్సులో పాల్గొన్న వారంతా దేగకన్నుతో పని చేయాలని సూచించారు. దళితబంధు పటిష్ట అమలుకు మమేకమై పనిచేయాలన్నారు.

ఇష్టమైన రంగాల్లో ఉపాధి.. రక్షణకు ప్రత్యేకంగా నిధి

ఎరువుల దుకాణాలు, మెడికల్ షాపులు, రైస్‌మిల్లులు, వైన్‌షాపులు.. ఆర్థికాభివృద్ధికి అవకాశం ఉండే రంగాల్లో దళితులకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. పవర్ టిల్లర్, హార్వెస్టర్, వరినాటు వంటి వ్యవసాయ యంత్రాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు, కోళ్ల పెంపకం, టెంట్‌హౌస్, ఆయిల్, పిండి మిల్లులు, సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమ, స్టీల్ వంటి బిల్డింగ్ మెటీరియల్ దుకాణాలు, ఫొటో.. వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ షాప్స్, హోటల్స్, క్లాత్ ఎంపోరియం, ఫర్నీచర్ దుకాణాలు వంటి ఉపాధి, పరిశ్రమ, వ్యాపార రంగాలను బట్టి ఇష్టాన్ని బట్టి.. దళితబంధు పథకం ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. దళితబంధు పథకం ద్వారా అందించే ఆర్థిక సాయానికి అదనంగా ప్రభుత్వ లబ్ధిదారుల భాగస్వామ్యంతో శాశ్వత ప్రాతిపదికన దళిత రక్షణ నిధి ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రక్షణ నిధి కలెక్టర్ల పర్యవేక్షణలో లబ్ధిదారులతో కమిటీ నిర్వహించబడుతుందన్నారు. ప్రతి ఏటా కనీసం డబ్బును జమ చేస్తూ దళిత రక్షణ నిధిని నిరంతరాయంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఆర్థికంగా పటిష్టంగా నిలదొక్కుకునే దిశగా రక్షణనిధిని వినియోగించనున్నట్లు తెలిపారు.

దళితబంధుతో అభివృద్ధికి బాటలు

ఎవరి సహకారం లేక బాధపడుతున్న దళితులకు ఈ పథకం బాటలు వేస్తుందన్నారు. దళితుల విజయం ఇతర కులాలు, వర్గాలకు.. పక్క రాష్ట్రాలకు మాత్రమే కాదు.. దేశానికే వెలుతురు ప్రసరింపజేస్తుందన్నారు. దళితులు విజయం సాధించి వెలుగు దివ్వెలు.. కరదీపికలుగా మారాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ గెలుపు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలువాలని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ విజయం రాష్ట్ర, దేశవ్యాప్తంగా ప్రసరించాలనదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

## 'విజయ్ దివస్' సందర్భంగా జాతీయ యుద్ధ స్మారకస్థూపం వద్ద అమర సైనికులకు నివాళులు అర్పించిన రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్



న్యూఢిల్లీ, జులై 26:22వ కార్గిల్ 'విజయ్ దివస్' సందర్భంగా, అమరులైన వీర సైనికులకు దిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకస్థూపం వద్ద రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నివాళులు అర్పించారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం లేదా ఆపరేషన్ విజయ్‌లో పాల్గొని, తమ ప్రాణాలను పణంగా పెట్టి భారతదేశానికి విజయాన్ని అందించి అమరులైన వీర సైనికులకు, వారి అత్యున్నత త్యాగం పట్ల గౌరవం ప్రకటిస్తూ, రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు.

ఎన్‌డబ్ల్యూఎం వద్ద సందర్శకుల పుస్తకంలో రాసిన తన సందేశంలో, కార్గిల్ యుద్ధంలో మన సైనికులు ప్రదర్శించిన శౌర్యాన్ని రక్షణ మంత్రి గుర్తుచేసుకున్నారు. వీర సైనికులు చేసిన ఆత్మార్పణను దేశం ఎన్నటికీ మరచిపోదని పేర్కొన్నారు. దేశం వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని, వారి ఆదర్శాలను అనుసరిస్తుందని రాశారు.

వీరులైన మన సైనికులు చేసిన అత్యున్నత త్యాగం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని రక్షణ మంత్రి ట్వీట్ చేశారు.

సైనికుల సాహసం, త్యాగానికి వందనం సమర్పిస్తూ, శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ట్విట్టర్‌లో ఒక దృశ్య సందేశాన్ని కూడా పంచుకున్నారు.

రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ అజయ్ భట్, వైమానిక దళాధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కేఎస్ భదౌరియా, సైనికాధిపతి జనరల్ ఎంఎం నరవణె, రక్షణ శాఖ కార్యదర్శి

డా. అజయ్ కుమార్, చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ టు ది చైర్మన్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీఐఎస్‌సీ), వైస్ అడ్మిరల్ అతుల్ కుమార్ జైన్ కూడా అమర వీరులకు నివాళులు అర్పించారు. రక్షణ శాఖ సీనియర్ సివిల్, మిలిటరీ అధికారులు కూడా ఈ కార్యక్రమం పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధ సమయంలో; వైమానిక దళం సాయంతో భారత వీర సైనికులు చెలరేగి పోయారు. దుర్భేద్య పర్వత ప్రాంతాలను, ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి, వ్యూహాత్మక పర్వత శిఖరాలపైకి చేరుకుని, శత్రువుపై గెలిచారు. ఈ విజయానికి గుర్తుగా, దేశవ్యాప్తంగా జరిగిన వివిధ సంఘటనలలో అమరులైన సైనికులను మననం చేసుకుంటూ దేశం ఏటా 'విజయ్ దివస్' జరుపుకుంటోంది.

## మహారాష్ట్రలో వరద బీభత్సం

## 164 మంది మృతి.. 100 మంది గల్లంతు



ముంబై, జులై 26:: మహారాష్ట్రలో భారీ వర్షాలు విలయం సృష్టిస్తున్నాయి. వర్షాల కారణంగా వరదలు సంభవించి కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటివరకు 164 మంది ప్రాణాలు కోల్పోయారు.

మరో 100 మంది గల్లంతయ్యారు. సుమారు 1,028 గ్రామాల్లో ప్రాణనష్టం సంభవించినట్లు ఆ రాష్ట్ర సహాయ, పునరావాసశాఖ తెలిపింది. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సుమారు 2.29 లక్షల మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదల ధాటికి 25,564 జంతువులు మృత్యువాతపడ్డాయి. 56 మంది గాయపడ్డారు. 100 మందికిపైగా గల్లంతైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇవాళ 259 పునరావాస కేంద్రాల్లో 7,832 మంది ఆశ్రయం పొందుతున్నట్లు వెల్లడించారు. సతారా జిల్లా పఠాన్ తాలూకాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే పర్యటించారు. వరద సహాయక శిబిరాలను ఆయన పరిశీలించి, వరద బాధితులతో మాట్లాడారు. కొల్హాపూర్ జిల్లాలో 6 ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సుమారు 1500 మందిని లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు ఎన్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ తెలిపారు. వరదల ధాటికి ఈ జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది.

## సింగరేణిలో పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంపు

హైదరాబాద్ , జులై 26: సింగరేణి అధికారులు, కార్మికులకు యాజమాన్యం శుభవార్త చెప్పింది. పదవీ విరమణ వయసును 61 సంవత్సరాలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. సోమవారం జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సీఎండీ శ్రీధర్ తెలిపారు. వయసు పెంపు నిర్ణయం ఈ ఏడాది మార్చి 31 నుంచి అమలులోకి రానుందని చెప్పారు. ఈ నిర్ణయంతో మార్చి 31 జూన్ 30 మధ్య పదవీ విరమణ చేసిన వారికి మళ్లీ ఉద్యోగాలు వస్తాయని.. 43,899 మంది అధికారులు, కార్మికులకు లబ్ధి చేకూరుతుందని సింగరేణి సీఎండీ శ్రీధర్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పదవీ విరమణ వయసును పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పెళ్లయిన, విడాకులు పొందిన కుమార్తెలకూ కారుణ్య నియామకాల్లో అవకాశం దక్కనుంది. ఈ సందర్భంగా సింగరేణి ఉద్యోగాల్లో 10శాతం ఈబీసీ రిజర్వేషన్ల అమలుకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపినట్లు సీఎండీ చెప్పారు. సింగరేణిలో అన్ని ఉద్యోగాలకు లింగబేధం లేకుండా అవకాశాలకు అనుమతికి సమావేశం ఆమోదం తెలిపినట్లు వివరించారు.

## ఈ నెల 31 న భారత్-చైనా మధ్య 12వ రౌండ్ చర్చలు

న్యూఢిల్లీ, జులై 26:భారతదేశం-చైనా మధ్య 12 వ రౌండ్ చర్చలు ఈ నెల 31 న జరుగనున్నాయి. ఇరు దేశాల మధ్య కార్ప్స్ కమాండర్ స్థాయిలో జరుగనున్న ఈ సమావేశంలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్, డెప్సాంగ్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవడంపై చర్చించనున్నారు. లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) పై కొనసాగుతున్న ఉద్రిక్తతను అంతం చేయడానికి భారతదేశం-చైనా సైనిక అధికారుల 12 వ రౌండ్ సమావేశాన్ని నిర్వహిస్తున్నాడు. వాస్తవానికి 26 న సమావేశం నిర్వహణకు అంగీకరించిన చైనా.. కార్గిల్ విజయ్ దివాస్ కారణంగా సమావేశాన్ని వేరే రోజున నిర్వహించాలన్న భారత్ విజ్ఞప్తికి చైనా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో ఈనెల 31 న ఇరుదేశాల మధ్య కార్ప్స్ కమాండర్ స్థాయిలో చర్చలు జరుగనున్నాయి.

సరిహద్దులోని గోగ్రా, హాట్ స్ప్రింగ్, డెస్పాంగ్‌లోని 900 కిలోమీటర్ల ప్రాంతంలో ఉద్రిక్తతను తగ్గించడంపై భారతదేశం దృష్టి పెట్టింది. గతేడాది ఇక్కడ పరిస్థితులను పునరుద్ధరించాలని భారత్ కోరుకుంటుండగా.. చైనా దీనికి సిద్ధంగా లేదు. గోగ్రా, హాట్ స్ప్రింగ్‌లోని అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారత్ కోరుకుంటున్నది. డెప్సాంగ్‌పై ఏకాభిప్రాయానికి రావడానికి సమయం పడుతుందని భారత్ భావిస్తున్నది. తూర్పు లడఖ్‌లోని డెమ్‌చోక్‌లోని చార్డింగ్ నాలా ప్రాంతంలోని భారతీయ ప్రాంతాలలో ఇప్పటికే చాలా గుడారాలు ఏర్పాటు చేశారు. చైనా పౌరులు కూడా ఇక్కడ నివసిస్తున్నారని, చాలాసార్లు చెప్పినప్పటికీ వారు ఖాళీ చేయడం లేరని భారత అధికారులు అంటున్నారు.

భారతదేశం-చైనా మధ్య ఇప్పటివరకు 11 రౌండ్ల సమావేశాలు జరిగాయి. మునుపటి 11 సమావేశాలలో తూర్పు లడఖ్‌లోని ఉత్తర, దక్షిణ ప్యాంగాంగ్ సరస్సు ప్రాంతాలలో విడదీయడంపై ఒక ఒప్పందం కుదిరింది. ఆర్మీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ప్రాంతాలలో విడదీయబడిన తర్వాత రెండు దేశాల సైన్యాలు తమ శాశ్వత పోస్టులకు చేరుకున్నాయి. గాల్వన్ లోయలో హింసాత్మక ఘర్షణ అనంతరం భారతదేశం-చైనా మధ్య సంబంధాలు చెడిపోయాయి. ఇరుదేశాల సైన్యాలు భారీ ఆయుధాలు, వేలాది మంది సైనికులతో మోహరించి తలపడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్మీ, వైమానిక దళం, నౌకాదళానికి చెందిన ప్రమాదకరమైన కమాండోలను భారత్ మోహరించింది. ఫైటర్ జెట్‌లు చాలా రోజులుగా నిరంతరం ఎగురుతున్నాయి. భారత్ ఇప్పటికే లాజిస్టిక్స్ సహా ఇతర ముఖ్యమైన వస్తువులను సరిహద్దులకు చేరవేసింది.

## పెట్రో ఉత్పత్తులపై పన్నులు, సుంకాలతో మౌలిక రంగాల అభివృద్ధి : కేంద్రం

న్యూఢిల్లీ, జులై 26:పెట్రోల్, డీజిల్‌పై వసూలు చేసే ఎక్సైజ్ డ్యూటీ ఇతర సుంకాలతో సమకూరిన నిధులను మౌలిక సదుపాయాల అభివృద్ధికి వెచ్చిస్తామని కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో పేర్కొంది. ఈ రాబడిని ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలు, కార్యక్రమాలకూ ఈ నిధులను వాడతామని తెలిపింది.

మహమ్మారి విజృంభించిన సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కార్యక్రమం కింద 80 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచిత రేషన్ కల్పించామని గుర్తుచేసింది.

దేశప్రజలకు ఉచితంగా కొవిడ్-19 వ్యాక్సినేషన్ చేపడుతున్నామని వివరించింది. పెట్రో సుంకాలతో సమకూరిన రాబడిని మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి కల్పనకూ వెచ్చిస్తామని వెల్లడించింది.

ఇక లీటర్ పెట్రోల్‌పై కేంద్ర ప్రభుత్వం రూ 32.90 ఎక్సైజ్ డ్యూటీ వసూలు చేస్తుండగా వివిధ సెస్‌ల పేరిట మరికొంత మొత్తం దండుకుంటోంది. ఇక రాష్ట్రాలూ పెట్రో ఉత్పత్తులపై పన్నులు విధిస్తున్నాయి. కాగా ఇంధన ధరల పెరుగుదల వ్యవహారంలో బీజేపీ సర్కార్ తీరును విపక్షాలు ఎండగడుతున్నాయి. వాహనదారుల జేబులు లూటీ చేయడమే కాకుండా పెట్రో సెగలతో ధరల మంట ఆందోళన రేకెత్తిస్తోందని విపక్షాలు మోదీ సర్కార్‌పై మండిపడుతున్నారు.


## ఆగస్టు 1 నుంచి ఢిల్లీ జూ పునఃప్రారంభం..!

న్యూఢిల్లీ, జులై 26:ఢిల్లీ జంతు ప్రదర్శనశాల వచ్చే నెల 1వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్నది. ఈ విషయాన్ని ఢిల్లీ జూ డైరెక్టర్ రమేశ్ పాండే ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆగస్టు 1 నుంచి ఢిల్లీ జూను పునఃప్రారంభిస్తామని, అయితే ఎప్పటిలాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కాకుండా సందర్శకులను రోజూ రెండు షిఫ్టుల్లో అనుమతిస్తామని ఆయన పేర్కొన్నారు. మొదటి షిఫ్టు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అయితే, ప్రవేశాలకు ఆఫ్‌లైన్ బుకింగ్ ఉండదని ఆయన వెల్లడించారు. కేవలం ఆన్‌లైన్ ద్వారానే ఎంట్రీ టికెట్‌లు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

### చరిత్రలో నేటినిజం



(జులై 27 హేతువాది కత్తిపద్మారావు పుట్టినరోజు...)



-రాధశ్రీ

సెల్: 9494481210

## భక్తుల బాధ్యత నాదే.. భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత




హైదరాబాద్ , జులై 26:సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయంలో రంగం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. మహమ్మారితో ఎన్ని కష్టాలు వచ్చినా సంకోచించకుండా ఉత్సవాలను వైభవంగా నిర్వహించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. భక్తులు సంతోషంగా ఉండే విధంగా చూసుకొనే బాధ్యత తనదేనని, ఎంత పెద్ద ఆపద వచ్చినా మీ వెంటే ఉండి కాపాడుతానన్నారు. కరోనా మహమ్మారి ప్రజలను చాలా ఇబ్బందులు పెట్టిందని, వర్షాలతో రైతులు కొంత ఇబ్బందులు పడతారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భక్తులు తనను నమ్మి పూజలు చేశారని, వారిని కాపాడే బాధ్యత తనదేనని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు

## యువరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్ , జులై 26: భారత మాజీ స్టార్ క్రికెటర్ యువరాజ్ సింగ్‌కు నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. యువరాజ్‌కు చెందిన యూవీకెన్ ఫౌండేషన్ రూ. 2.5కోట్ల వ్యయంతో 120 క్రిటికల్ కేర్ బెడ్స్‌ను నిజామాబాద్ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది. దవాఖానలో ప్రత్యేక బెడ్స్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక చొరవ చూపారు. ఫౌండేషన్‌తో అనేకసార్లు చర్చలు జరిపిన కవిత.. క్రిటికల్ కేర్ బెడ్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత నెలలోనేనూ ఫౌండేషన్ సీఈఓ రిషబ్ బిష్ణోయ్‌తోనూ ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. ఈ మేరకు ఫౌండేషన్ ఇటీవల ఆసుపత్రిలో బెడ్స్‌ను చేసింది. సంస్థ ప్రతినిధులు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి సాయానికి సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యువీ, ఫౌండేషన్ ప్రతినిధులకు జిల్లా ప్రజల పక్షాన ఎమ్మెల్సీ కవిత ధన్యవాదాలు తెలిపారు.

# కలాం జీవితం అద్వితీయం, అనుసరణీయం

(27 జూలై 'ఏ పి జే అబ్దుల్ కలాం వర్ధంతి' సందర్భంగా)



భారత 11వ రాష్ట్రపతిగా (2002-07) విశిష్ట సేవలందించి 'ప్రజా ప్రసిడెంట్'గా ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసిన అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం 15 అక్టోబర్ 1931న ప్రముఖ దక్షిణ భారత తీర్థ స్థలం రామేశ్వరం పట్టణంలో పేద తమిళ ముస్లిమ్ కుటుంబంలో ఆశియమ్మ - జైనులబ్దీన్ దంపతులకు జన్మించారు. రామేశ్వరంలో పాఠశాల విద్య, తిరుచురాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో భౌతిక శాస్త్రం (1954), మద్రాస్ యంఐటిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ (1960) పట్టాలు పొందారు. అతి సాధారణ విద్యార్థి దశ నుంచి అసాధారణ మేధావిగా కలాం ఎదిగిన క్రమం విలక్షణం, ఆశ్చర్యకరం. నాలుగు దశాబ్దాల ఉద్యోగపర్వంలో ఏరోస్పేస్ సైంటిస్ట్‌గా, సైన్స్ అడ్మినిస్ట్రేటర్‌గా విలక్షణ సేవలందించే క్రమంలో డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలంప్‌మెంట్ ఆర్గనైజేషన్), ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసర్చ్ ఆర్గనైజేషన్) సంస్థల్లో పరిపాలనాదక్షుడిగా, మిలటరీ మెసైల్ రూపశిల్పిగా తన సత్తా చాటి 'మెసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా కీర్తించబడ్డారు. ప్రధాని ముఖ్య వైజ్ఞానిక శాస్త్ర సలహాదారుగా, డిఆర్‌డిఓ సెక్రటరీగా 1992 నుంచి 1999 వరకు పని చేశారు. స్వావలంభన దిశగా భారతదేశాన్ని న్యూక్లియర్ ఎనర్జీ కలిగిన దేశంగా నిలపటానికి 1998లో పోక్రాన్-? పరీక్షలను పర్యవేక్షించి ప్రజల చేత జేజేలు అందుకున్నారు. భారత వాయు సేనలో ఫైటర్ పాయిలెట్‌గా పని చేయాలనుకున్న కలాం ఏరోస్పేస్ శాస్త్రజ్ఞుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగారు. ఇంజనీర్, సైంటిస్ట్, రచయిత, ఆచార్యులు, రాజకీయవేత్తగా బహుముఖీన ప్రతిభ కలిగిన అబ్దుల్ కలాం బోధనలు అనితరసాధ్యాలు. నేను చేయగలననే దృఢ సంకల్పమే విజయాలను అందిస్తుందని, ఎవరి తలరాతను వారే లిఖించుకోవాలని, నిజాయితీగల హృదయంతోనే వ్యక్తిత్వం వ్యక్తం అవుతుందని బోధనలు చేశారు.

'ఉన్నత కలలు కనండి, సాకారానికి కఠోర సాధన చేయండి' అంటూ నినదించిన కలాం జీవితం తెరిచిన పుస్తకం, యువతకు మార్గదర్శకం. పడవలు నడిపే వృత్తిలో పేరుగాంచిన కలాం కుటుంబం, వ్యాపారంలో నష్టం రావడంతో కష్టాల కడలిలో పట్టుదలతో చదువులను కొనసాగిస్తూ, పేపర్ బాయ్‌గా పని చేస్తూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌ను పూర్తి చేయగలగడం నేటి యువతకు ప్రేరణాత్మకం. ఉద్యోగిగా తన సీనియర్స్ డా: విక్రమ్ సారాభాయ్, ఆచార్య సతీష్ ధవన్, డా: బ్రహ్మ ప్రకాశ్ లాంటి దిగ్గజాల వద్ద నాయకత్వ పటిమను, అంతరిక్ష శాస్త్రసాంకేతిక మెలకువలను నేర్చుకున్నారు. 1969లో ఇస్రోకు బదిలీ అయిన కలాం నేతృత్వంలో భారత తొలి సాటలైట్ లాంచింగ్ వెహకిల్ (యస్‌యల్‌వి-3)ను రూపొందించుటలో విజయం సాధించారు. 1970-90ల మధ్య పియస్‌యల్‌వి (పోలార్ సాటలైట్ లాంచింగ్ వెహకిల్), యస్‌యల్‌వి-3లను అభివృద్ధి చేయుటలో ప్రధాన భూమికను నిర్వహించారు. 'బాలిస్టిక్ మెసైల్' టెక్నాలజీతో 'ప్రాజెక్ట్ డెవిల్', 'ప్రాజెక్ట్ వాలియంట్'లను రూపొందించడంలో మార్గదర్శనం చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మెసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఐజియండిపి) ద్వారా కలాం చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ? 3.88 బిలియన్ పెట్టుబడితో పరిశోధనలు కొనసాగించారు. 'అగ్ని', 'పృథ్వి' మెసైల్‌లను విజయవంతంగా నిర్మించగలిగారు. 1998లో చవకైన 'కలాం-రాజు కరోనరీ స్టంట్'ను, 2012లో 'కలాం-రాజు టాబ్లెట్' హెల్త్‌కేర్ కంప్యూటర్‌ను రూపొందించారు. టెక్నాలజీ సహాయంతో ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, విద్యారంగాలను పరిపుష్టం చేయవచ్చని గట్టిగా నమ్మిన కలాం ముందు చూపు అద్వితీయం. జననం సాధారణమే కావచ్చు, మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలని ఉద్భోధించారు.

25 జూలై 2002న రాష్ట్రపతి పదవిని చేపట్టి భారత తొలి పౌరుడిగా 'ప్రజల ప్రసిడెంట్'గా పేరు తెచ్చుకున్నారు. భారత అత్యుత్తమ 'భారత రత్న' అవార్డు పొందిన ఏకైక తొలి సైంటిస్ట్, బాచిలర్ కలాం అనంతరం రాష్ట్రపతిగా విశిష్ట సేవలు అందించారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన కలాం 'లీడ్ ఇండియా-2020' ఉద్యమాన్ని ప్రారంభించి ఐదేళ్ళలో 5 లక్షల యువతకు మార్గదర్శకం చేయాలనే లక్ష్యాన్ని ఛేదించుటకు కృషి చేశారు. అనేక అగ్ర విద్యాసంస్థలు ఐఐయం, ఐఐయస్‌సి, ఐఐఐటి, బిహెచ్‌యు, అన్నా విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా అమూల్య సేవలు, అనుభవసారాలు అందజేశారు. తన జీవితకాలంలో 40కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు అందుకోగలిగారు. అత్యుత్తమ పౌర పురస్కారం భారత రత్నతో పాటు పద్మవిభూషణ్, పద్మ భూషన్, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత అవార్డు, వీర సావర్కర్, శస్త్ర రామానుజన్, వాన్ బ్రాన్ లాంటి పలు అవార్డులతో సన్మానాలు అందుకున్నారు. తన అనుభవాలను, ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశ్యంతో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా-2020', 'ఇగ్నైటెడ్ మైండ్స్', 'ఇండామిటబుల్ స్పిరుట్స్' లాంటి పలు పుస్తకాలు రచించారు. 26 జూలై 2015న ఐఐయం, షిల్లాంగ్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తూనే 83వ ఏట తుది శ్వాస విడిచిన ఏ పి జె అబ్దుల్ కలాం జీవితం ఆసాంతం అనుసరణీయం, సదా స్మరణీయం. బలమైన విజయకాంక్షతోనే అపజయాలను అధిగమించాలని, విద్య రెక్కలతోనే ఎదిగాలంటూ నినదించిన కలాం దార్శనికత పరమ పవిత్రం, ప్రగతికి ఇంధనం. 'సక్సెస్ అంటే మన సంతకం ఆటోగ్రాఫ్‌గా మారాడమే' అన్న కలాం 'కల అంటే నిద్రలో వచ్చేది కాదని, నిద్ర పోనివ్వకుండా చేసేదని' నమ్మిన అపూర్వ మూర్తిమత్వ నిధి మన అజేయ అబ్దుల్ కలాం.



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తులకు గడువు పొడగింపు..!

**-జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

సంగారెడ్డి , జూలై 26 (నేటినిజం ప్రతినిధి) ఇంటింటా ఇన్నోవేటర్ దరఖాస్తుల గడువు ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

స్వాతంత్ర దినోత్సవం నాడు సామాజిక సమస్యలకు వినూత్నమైన పరిష్కారాలు రూపొందించిన వారి ఆవిష్కరణలు ఆన్లైన్ ప్రదర్శించనున్నట్లు రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ అవకాశం కల్పిస్తున్నట్లు



తెలిపారు. ప్రతి ఇంటా ఉన్న ఆవిష్కర్తలు వివిధ సమస్యలకు పరిష్కారం కనుగొనేలా ప్రోత్సహిస్తున్నారు.

ఎంపికైన ఆవిష్కరణలు స్వాతంత్ర దినోత్సవం నాడు జిల్లాలో ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

మన సమాజంలో లేదా చుట్టుపక్కల ఉన్న సమస్యలు, విద్యాలయాల్లో, వ్యవసాయరంగానికి, ఏ రంగానికి సంబంధించినదైనా వాటిని పరిష్కరించే విధంగా ఆలోచనలు/సరికొత్త ఆవిష్కరణలు రూపొందించినవారు.

ఏదైనా సమస్యకు కొత్త పరిష్కారం కనుక్కున్నా, సమస్యకు పరిష్కారం కనుక్కున్న విధానం నూతనంగా ఉన్నా ఆవిష్కరణల పర్యావరణాన్ని, అదేవిధంగా ఒక పరికరం చేస్తూ దాని లో ఉపయోగించే వస్తువులు/పరికరాలు వినూత్నంగా ఉన్నా, ఉన్న వస్తువులను మరింత ఆలోచన జోడించి వస్తు ఉపయోగాలను పెరిగినా ఆవిష్కరణగా పరిగణిస్తారని ఆయన వివరించారు.

ఆవిష్కర్తలు తమ ఆవిష్కరణకు సంబంధించిన ఆరు వాక్యాలు, రెండు నిమిషాల వీడియోను, ఆవిష్కరణ నాలుగు ఫోటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయస్సు, ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లా పేరుతో సహా నిర్ణీత గడువులోగా 9100678543 కు వాట్సాప్ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని రంగాలకు చెందినవారు తమ ఆలోచనలను పదును పెట్టి నూతన ఆవిష్కరణలను పెద్ద మొత్తంలో పంపి జిల్లాను ముందు స్థానంలో నిలబెట్టాలని కలెక్టర్ కోరారు.

## 'మన్ కీ బాత్' ప్రసంగంలో చండీగఢ్‌లోని ఫుడ్‌స్టాల్ యజమానికి ప్రధాని ప్రశంస

న్యూఢిల్లీ, జులై 26: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తన నెలవారీ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం ద్వారా ఇవాళ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ చండీగఢ్‌లోని ఓ ఫుడ్‌స్టాల్ యజమాని సంజయ్ రాణా చొరవను ప్రశంసించారు. ఈ మేరకు కోవిడ్-19 టీకాలు తీసుకునేలా ప్రజలను ప్రేరణ ఇవ్వడంలో ఆయన చొరవను కొనియాడారు. కోవిడ్ టీకా తీసుకున్నవారికి 'ఛోలే భటూరే' వంటకాన్ని రాణా ఉచితంగా ఇవ్వాలన్న తన ఆలోచనను ప్రధాని ఆమోదించి అభినందించారు.

చండీగఢ్‌లోని సెక్టర్-29లో సంజయ్ రాణా సైకిలుపైనే 'ఛోలే భటూరే' అమ్ముతుంటారు. ఈ క్రమంలో టీకా వేయించుకున్న రోజున ఆ మేరకు ఆధారం చూపినవారికి ఈ వంటకాన్ని ఉచితంగా అందజేస్తున్నారని ప్రధానమంత్రి వెల్లడించారు. దీన్నిబట్టి డబ్బున్నా సమాజ సంక్షేమం, సేవాస్ఫూర్తి, కర్తవ్య నిర్వహణలే మిన్న అని రుజువు చేశాడంటూ సదరు ఫుడ్‌స్టాల్ యజమాని చొరవను ఆయన మరోసారి ప్రశంసించారు.

# చిరపుంజిలోని సోహ్రా వద్ద హరిత సోహ్రా అటవీ పెంపకం ప్రచారాన్ని ప్రారంభించిన హోంమంత్రి

న్యూఢిల్లీ, జులై 26:కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా తన మేఘాలయ రెండో రోజు పర్యటనలో భాగంగా ఈరోజు చిరపుంజి (సోహ్రా)లో అటవీపెంపకం, హరిత సోహ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ అమిత్ షా గ్రేటర్ సోహ్రా మంచినీటి సరఫరా పథకాన్ని కూడా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, సైన్స్, టెక్నాలజీ, అంతరిక్ష శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయమంత్రి శ్రీ బి.ఎల్.వర్మ, మేఘాలయ ముఖ్యమంత్రి శ్రీ కోన్‌రాడ్ సంగ్మా, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అడవుల పెంపకం, మొక్కలు నాటడం ప్రాధాన్యతను తెలియజేస్తూ కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా ఎవరెస్ట్ నార్త్ ఈస్ట్ నినాదాన్ని ఇచ్చారు. గతంలో చిరపుంజిలో ఏడాదిపొడవునా వర్షాలు ఉండేవని ,అయితే అభివృద్ధి పేరుతో విచక్షణ రహితంగా చెట్లు కొట్టివేతతో పరిస్థితి మారిపోయిందని,

చిరపుంజిని హరితమయం చేసే కార్యక్రమం తిరిగి ప్రారంభమైందని ఆయన చెప్పారు. చిరపుంజి మొత్తం ప్రాంతాన్ని అస్సాం రైఫిల్స్ మొక్కలు నాటడానికి దత్తత తీసుకున్నట్లు ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా తెలిపారు.

చెట్లను వంట చెరకు కోసం, ఇతర అవసరాల కోసం కొట్టివేస్తున్నారని, అందువల్ల మొత్తం భూమిలో 80 శాతం మొక్కలను సంప్రదాయ, దీర్ఘకాలం ఉండే చెట్లను నాటడం జరుగుతుందని అన్నారు. మిగిలిన 20 శాతం లో జంతువులకు ఆహారంగా ఉపయోగపడేవి, నర్సరీ, అలంకరణ మొక్కలు పెంచడం జరుగుతుందన్నారు. దీనివల్ల దీర్ఘకాలం ఉండే మొక్కల సంఖ్య పెరుగుతుందని, దీనితో బహుళ అంచెల సాగు చేయవచ్చని, అటవీ ప్రాంతం 30 రెట్లు వేగంగా పెరుగుతుందని అన్నారు.

మూడు సంవత్సరాల తర్వాత దీనికి నిర్వహణ ఖర్చులు కూడా ఏమీ ఉండవని చెప్పారు. పర్యావరణ పర్యాటకానికి దీనివల్ల బాగా ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు. అలాగే పర్యాటక రంగం వల్ల మేఘాలయం బాగా అభివృద్ధి చెందుతుందన్నారు.

సరిహద్దుల రక్షణకు పేరామిలిటరీ బలగాల నియామకం వల్ల దేశం భద్రంగా ఉందని శ్రీ అమిత్ షా అన్నారు. గత రెండు సంవత్సరాలుగా వారు పర్యావరణాన్ని మెరుగు పరిచే బాధ్యతను చేపట్టారని ఆయన అన్నారు.ఇప్పటివరకు వారు 1.48 కోట్ల మొక్కలు నాటారని ఇందులో 1.36 కోట్ల మొక్కలు పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ సంవత్సరం కూడా దేశంలోని వివిధ ప్రాంతాలలో కోటి మొక్కలు నాటనున్నారని రాగల మూడు సంవత్సరాలలో వెయ్యి హెక్టార్లలో మిలియన్ చెట్లు నాటనున్నారని చెప్పారు.

ప్రస్తుతం ప్రపంచం మొత్తం భూగోళం వేడెక్కడానికి, వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా పోరాడుతున్నదని శ్రీ అమిత్ షా చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వంటగ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయడం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గించగలిగారని అన్నారు. ఆ రకంగా భారతదేశం జల విద్యుత్, సౌర విద్యుత్ ఉత్పత్తి రంగాలలో ముందుందని ఆయన అన్నారు.

పారిస్ ఒప్పందంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ ప్రతిపాదించిన కార్యాచరణకు అనుగుణంగా మొత్తం ప్రపంచం ఇవాళ భూగోళం వేడెక్కడాన్ని , కార్బన్ ఉద్గారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నదని,

మనం సాగిస్తున్న పోరాటం, జిల్లాపంచాయత్, తాలూకా పంచాయత్ ల స్థాయిలో సామాన్య ప్రజల సహకారం లేనిదే విజయవంతం కాదని అన్నారు. వివిధ స్థాయిల్లో పెరా మిలిటరీ బలగాలు చేపట్టిన 10 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమానికి నాయకత్వం వహించాలని అన్ని పంచాయతీలకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా, ప్రధానమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి పథకం కింద ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వశాఖ, మేఘాలయ ప్రభుత్వం, 25 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన గ్రేటర్ సోహ్రా వాటర్ ప్రాజెక్టు ప్రతి ఇంటికి మంచినీటిని సరఫరా చేస్తుందని, పరిశుభ్రత లేకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండరని శ్రీ అమిత్ షా అన్నారు. అందువల్ల మేఘాలయ లోని ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీటిని 75 వసంతాల స్వాతంత్ర దినోత్సవం, 50 సంవత్సరాల మేఘాలయ ఉత్సవాలకు ముందే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారని తెలిపారు. మేఘాలయలోని 2,80,000 కుటుంబాలకు మంచినీటిని అందించాలన్నది బృహత్తర లక్ష్యమని దీనిని 1874 నుంచే ప్రాజెక్టులుగా రూపొందించడం జరిగిందన్నారు. ఇలాంటి ప్రాజెక్టును మారుమూల ప్రాంతంలో అమలు చేయడం సవాలుతో కూడుకున్నదని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమానికి 400 కోట్ల రూపాయలు కేటాయించిందని, పని పురోగతిని బట్టి మరిన్ని నిధులు విడుదల చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. గత 180 సంవత్సరాలలో అస్సాం రైఫిల్స్ తనకు అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేస్తూ వచ్చిందని ఆయన అన్నారు.

దేశంలోని అన్ని కేంద్ర సాయుధ బలగాలు (సిఎపిఎఫ్)లు కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్‌షా చొరవతో ఈరోజు దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. ఈ రోజు 16 లక్షల 31 వేలకు పైగా మొక్కలను నాటడం జరుగుతుంది.

సోహ్రా లోని రామకృష్ణ మిషన్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి శ్రీ అమిత్ షా పూలమాలవేసి ఆయనకు నమస్కరించారు. అక్కడ జరిగిన ప్రార్థన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణ మిషన్ కు చెందిన ముఖ్యులను కలుసుకున్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డుల పంపిణీ : మంత్రి కేటీఆర్

**-కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సిరిసిల్లలో లాంఛనంగా ప్రారంభించిన మంత్రి**




రాజన్న సిరిసిల్ల, జులై 26:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారకరామారావు వెల్లడించారు. సోమవారం అర్హులైన వారికి నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సిరిసిల్ల లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు, నాఫ్స్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్ రావు, జెడ్పీ చైర్మన్ అరుణ, జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ లతో కలిసి మంత్రి లాంఛనంగా ప్రారంభించి, సభను ఉద్దేశించి ప్రసంగించారు.సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రాన్ని మించిన రాష్ట్రం దేశంలో లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల అభివృద్ధిని కాంక్షించి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. మన జిల్లాలో మొత్తం 2 వేల 777 మంది అర్హులకు నూతనంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మెన్ లు కళా, మాధవి, పౌర సరఫరాల అధికారి శ్రీ జితేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునిక సేవలు ప్రజల చెంతకు

**జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 2 కోట్ల 15 లక్షల విలువైన నూతన సిటీ స్కాన్ కేంద్రం అందుబాటులోకి**

**సిటీ స్కానింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీ కె. తారకరామారావు**



జిల్లా ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో సిరిసిల్ల లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 2 కోట్ల 15 లక్షల ప్రభుత్వ నిధులతో నూతనంగా సిటీ స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం మంత్రి కేటీఆర్ వేములవాడ శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు, నాఫ్స్కాబ్ చైర్మెన్ కొండూరు రవీందర్ రావు, జెడ్పీ చైర్మన్ అరుణ, జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ లతో కలిసి ప్రారంభించారు. జిల్లా ప్రజలకు దీనిద్వారా అత్యాధునిక సాంకేతికతతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా ఉంటుందని మంత్రి వెల్లడించారు. స్థానిక ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండేందుకు సిరిసిల్లలోనే ఈ సీటీ స్కానింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు.

## సంచలనాత్మక బొమ్మనపల్లి నవ వధువు హత్య కేసును 30గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు

# కట్టుకున్న భర్త మానవమృగంగా మారి హతమార్చాడు

కరీంనగర్ జులై 26: ఈనెల 23న చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో మిస్టరీగా మారిన నవ వధువు మ్యాదర ప్రణాళిక అలియాస్ గరిగె ప్రణాళిక (21) హత్య కేసును పోలీసులు సునిశిత పరిశీలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో ఛేదించారు. వివాహమై రెండు నెలలు గడువముందే అనుమానమే పెనుభూతమై, ఆమెకన్నా తక్కువ చదువుకున్నాననే ఆత్మనూత్యన్యభావం అన్నీ తోడై మానవ మృగంగా మారి ఎవరికి అనుమానం రాకుండా అత్యంత దారుణంగా హత్య చేశాడు. ఈ హత్య సంఘటనకు దోపిడీకి పాల్పడిన దొంగలు హత్యచేసిన విధంగా చిత్రీకరించాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

చిగురుమామిడి మండలం బొమ్మనపల్లికి చెందిన మ్యాదర అనీల్(26)కు హుజురాబాద్‌కు చెందిన గరిగె ప్రణాళిక అలియాస్ మ్యాదర ప్రణాళికతో రెండునెలల క్రితం వివాహం జరిగింది. భార్యతనకన్నా ఎక్కువ చదువుకుందనే ఆత్మనూన్యతభావం, అన్నివేళల్లో తనకు అనువుగా ఉండటం లేదని, తల్లిదండ్రులు, ఆమెతోపాటు చదువుకున్న స్నేహితులతో తరచూ ఫోన్‌లో మాట్లాడడాన్ని చూసి ఎవరితోనో మాట్లాడుతుందని అనుమానం పెంచుకుని తనతో శారీరకంగా సఖ్యత చూపడంలేదని, జీర్ణించుకోలేక, మానవమృగంగా మారాడు. మృతురాలు ప్రణాళిక బాసరలో ట్రిపుల్ ఐఐటి చదువుకుంటోంది. ఆమెతండ్రి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బీదకుంటుంబం కావడంతో కొంత బతుకుదెరువు ఉన్న కుటుబాన్ని చూసి పెళ్ళి చేయాలని నిర్ణయించుకుని బొమ్మనపల్లికి చెందిన అనీల్‌తో వివాహం చేశారు. నిందితుడు అనీల్ హుస్నాబాద్‌లో బ్యాటరీ రిపేరింగ్ చేసే దుకాణాన్ని నడుపుకుండున్నాడు. నవ వధులు ప్రణాళిక ఆషాడమాసంరాకతో పుట్టింటికి హుజురాబాద్‌కు అత్తమామ, భర్త అంగీకారంతో వెళ్ళింది. పుట్టింటికి వెళ్ళిన ప్రణాళికను నచ్చజెప్పి తనతనల్లికి జ్వరం వచ్చిందని, తనతోపాటు బొమ్మనపల్లికి వచ్చేలా జూలై 18న బొమ్మనపల్లికి తీసువచ్చాడు.




### హత్యకు కుట్ర, దోపిడి దొంగలు హత్యచేసినట్లుగా చిత్రీకరణ

ఈనెల 23న భార్య ప్రణాళికను హత్యచేయాలని నిర్ణయించుకున్న నిందితుడు అనీల్ హత్యకు ఒకరోజు ముందు కత్తిని హుస్నాబాద్‌లో కొనుగోలు చేశాడు. ఇంట్లో తల్లిదండ్రులకు, చుట్టుపక్కలవారికి ఎలాంటి అనుమానం రాకుండా ప్రతిరోజు లాగే ఈనెల 23న తన బైక్‌పై హుస్నాబాద్‌లోని తన బ్యాటరీ రిపేరింగ్‌షాపుకు వెళ్ళాడు. ఇంతలో 11 గంటల సమయంలో అనీల్ స్నేహితుడు ఒకతను వచ్చి తన పల్సర్‌బైక్‌ను అనీల్ షాపువద్ద ఉంచి సాయంత్రం వచ్చి తీసుకుంటాను. పనిమీద బయటకు వెళుతాన్నానని చెప్పి వెళ్ళాడు. ఇదే అదునుగా భావించి బ్యాటరీషాపులో మెకానిక్‌లు వాడే చమురు పదార్ధాలు అంటిన డ్రెస్‌ను ధరించి అతడి స్నేహితుడు తనషాప్‌వద్ద ఉంచిన పల్సర్ మీద ఎవరికీ అనుమానం రాకుండా బొమ్మనపల్లికి వచ్చాడు. ఇంటికి వెళ్ళే సరికి తనభార్య ఎవరితోనూ ఫోన్ మాట్లాడుతూ తను వెళ్ళగానే మళ్ళీ చేస్తానని, ఫోన్ కట్‌చేసిందని, ఇంకా తనను ఇలా ముందుగానే ఏమైనా పనిమీద వచ్చావని అడగడంతో ఉన్న అనుమానం రెట్టింపైందని, తనతో కొద్దిగా పనిఉండి రావాల్సివచ్చిందని సమాధానం ఇచ్చాడు. భార్యప్రణాళిక ఇంట్లోని మంచంపై బోర్లాపడుకుని తనతో మాట్లాడుకుండా సెల్‌ఫోన్ చూస్తుండగా భర్తఅనీల్ అమెపక్కన కూర్చిని టివి ఆన్‌చేసి(ఒకవేళ అరిస్తే చప్పుడు బయటకు వినిపించకుండా), పక్కరూంలోకి వెళ్ళి నీళు తాగి అంతకుముందే హుస్నాబాద్‌లో కొనుగోలు చేసి తనతో తెచ్చుకున్న కత్తితో మంచంపై బోర్లా పడుకున్న ప్రణాళిక వీపుమీద కూర్చుని జుట్టుపట్టి మెడను కత్తితో నరికాడు. వెంటనే ఆమె ప్రతిఘటించడంతో మరలా మరోవేటువేసి నరికాడు. ఇద్దరూ కిందపడ్డారు. పక్కరూంలో ఉన్న గొడ్డలితో మరలా క్రూరంగా నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ ఉండరని అనీల్ తల్లిదండ్రులు వ్యవసాయపనులకు పోతారని, అనీల్ ఆ సమయాన్ని ఎంచుకోవడం జరిగిందని చెప్పాడు. చుట్టుపక్కల వారుకూడా ఎవరూ లేకపోవడంతో ఆయుధాలకు అంటిన రక్తం మరకలను చూడిచి కడుగడంతోపాటు ఈ హత్యను కొందరి దోపిడి దొంగలు ఆభరణాలకోసం వచ్చి దొంగిలించి హత్యచేసినట్లుగా చిత్రీకరించి ఇంట్లోఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని వెంటనే హుస్నాబాద్ వెళ్ళిపోయాడు.

### స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

ఈరోజు ఉదయం హంతకుడిని అరెస్ట్ చేసి అతని వద్దనుండి హత్యకు వాడిన ఒకగొడ్డలి, కత్తిని స్వాధీనం చేసుకోవడం జరిగింది.

### తాను నిందిడిని కాదని తప్పించుకునేందుకు జిమ్మిక్కులు

భార్యహత్య కేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని అందరూ నమ్మేవిధంగా దోపిడిదొంగలు హత్యచేసినట్లు నేరస్థలాన్ని చిత్రీకరించి తన మిత్రుడి పల్సర్‌ను వాడి హత్యచేసిన వెంటనే హుస్నాబాద్‌కు వెళ్ళి ఒక బట్టలషాపులో కొత్తప్యాంట్ తీసుకుని రక్తం మరకలు అంటిన ప్యాంట్‌ను టీషర్టును, హత్యకు వాడిన కత్తిని ఒక కవర్‌లోపెట్టి మడద గ్రామం చెరువుకట్టవద్ద దాచిపెట్టాడు. హత్యకు వాడిన మరో ఆయుధం గొడ్డలిని తన ఇంటి వెనుకాల మెట్లకింద దాచిపెట్టాడు. యధావిధిగా తనషాప్‌కు వచ్చి ఎవరికీ అనుమానం రాకుండా తనపని తను చేసుకుంటున్నాడు. ఇదేగ్రామానికి చెందిన మరోస్నేహితుడు హుస్నాబాద్‌లోనే సెల్‌ఫోన్ రిపేరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తాడు. ఆరోజు మధ్యాహ్నం అతడితో కలిసి తన మనసు బాగా లేదని చెప్పి హుస్నాబాద్ శివారులో మద్యం సేవిస్తారు. సాయంత్రం పొలం పనులు ముగించుకుని ఇంటికివచ్చిన తనతల్లి ఫోన్‌చేసి తనభార్య ప్రణాళిక రక్తపు మడుగులో పడి ఉందని చెప్పగా వెంటనే తన స్నేహితుడు శ్రీకాంత్‌కు ఫోన్‌చేసి ఇద్దరూ కలిసి బొమ్మనపల్లికి బయలుదేరుతారు. తనమిత్రుడు శ్రీకాంత్ డయల్ 100ద్వారా పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారు.

### నేరాలకు పాల్పడిన వారు తప్పించుకోలేరు-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

బొమ్మనపల్లిలో జరిగిన నవ వధువు హత్యసంఘటనను పోలీసులు సవాల్‌గా తీసుకుని 30గంటల వ్యవధిలో ఛేదించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. హత్య జరిగిన సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలాన్ని సందర్శించిన సిపిగారు, వెంటనే ఏసీపి రితిరాజ్, కరీంనగర్ రూరల్ ఏసిపి విజయసారధి, కె శ్రీనివాస్ (సిసిఎస్), తిమ్మాపూర్ సిఐ శశిధర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్లు మల్లయ్య, సృజన్‌రెడ్డి, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ వి రవి, చిగురుమామిడి, ఎల్‌యండి ఎస్‌ఐలతో ప్రత్యేక బృందాలన ఏర్పాటు చేయడం జరిగింది.

సంఘటన స్థలాన్ని సునిశితంగా పరిశీలించడం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో కేసును ఛేధించడం జరిగిందని పేర్కొన్నారు.

## ఏపీలో సెంచరీ దాటిన డీజిల్ ధర




హైదరాబాద్ , జులై 26:కొన్నిరోజులుగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. పెట్రోల్ ధర ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సెంచరీ దాటేసింది. డీజిల్ ధర కూడా పెట్రోల్ బాటలోనే నడుస్తోంది. సోమవారం తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగాయి. దీంతో ఏపీలోని విజయవాడ, గుంటూరు నగరాల్లో డీజిల్ ధర రూ.100 దాటింది.

విజయవాడలో లీటర్ పెట్రోల్ రూ.108.71 కు లభిస్తుండగా.. లీటర్ డీజిల్ ధర రూ.100.25 లకు లభిస్తోంది. గుంటూరు జిల్లాలో లీటర్ పెట్రోల్ రూ. 108.71 లకు లభిస్తుండగా.. డీజిల్ రూ.100.25లకు లభిస్తోంది. విశాఖలో పెట్రోల్ ధర రూ.107.71 ఉండగా.. డీజిల్ ధర రూ.98.65గా ఉంది. విజయనగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.23లకు లభిస్తుండగా.. డీజిల్ ధర రూ.98.82గా ఉంది. కృష్ణా జిల్లాలో లీటర్ పెట్రోల్ ధర రూ. 108.39 గా ఉండగా.. డీజిల్ ధర రూ.99.96గా ఉంది.

హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 105.83గా, లీటర్ డీజిల్ ధర రూ. 97.96గా ఉన్నాయి. వరంగల్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 105.54 పలుకుతుండగా.. లీటర్ డీజిల్ ధర రూ.97.67గా ఉంది. రంగారెడ్డి జిల్లాలో లీటర్ పెట్రోల్ ధర రూ. 105.94ఉండగా.. డీజిల్ ధర రూ.98.06 గా ఉంది. కరీంనగర్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 105.97 గా ఉండగా.. లీటర్ డీజిల్ ధర ధర రూ.98.08గా ఉంది. ఖమ్మంలో పెట్రోల్ ధర రూ. 106.43గా ఉండగా.. డీజిల్ ధర రూ. 98.50గా ఉంది. మెదక్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 106.51గా ఉండగా.. డీజిల్ ధర రూ.98.59గా ఉంది.

## హుజూరాబాద్ ఉప ఎన్నికతో నాపై దుష్ప్రచారం: మాజీ ఐపీఎస్

హైదరాబాద్ , జులై 26:తర్వలో ఉప ఎన్నిక జరగనున్న హుజురాబాద్ లో దళిత బంధ సహా పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయాలు విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక కోసం వెదజల్లుతోన్న డబ్బును అభివృద్ధికి వినియోగించాలని మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. హుజూరాబాద్ లో కొందరికి తాను మద్దతు ఇస్తున్నట్లు తనమీద దుష్ప్రచారం జరుగుతోందని మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. తనపై వస్తోన్న ఈ ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. అంబేద్కర్ బాటలో నడిచేందుకు, ఒంటరి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, బహుజన, బడుగు వర్గాల బాగు కోసమే తాను పనిచేస్తానని తెలిపారు. తన మద్దతు ఎప్పుడూ విద్య, వైద్యం, ఉపాధి, అభివృద్ధి చేసే వారికే ఉంటుందని స్పష్టం చేశారు. తాను ఇప్పటికే వీఆర్ఎస్ తీసుకున్నానని, ప్రస్తుతం కొత్త ఇల్లు వెతుక్కునే పనిలో ఉన్నానని చెప్పారు. ఈ సమయంలో తనను వివాదాలలోకి లాగవద్దని కోరారు. ఒకవేళ తనను ఎవరైనా వివాదాల్లోకి లాగితే వారి అంచనాలు తలకిందులవుతాయని ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

## బీమా పాలసీపై గొప్పలు.. ఇప్పుడైనా మేల్కోండి సీఎం సారు: వైఎస్ షర్మిల

హైదరాబాద్ , జులై 26:తెలంగాణ సీఎం కేసీఆర్‌పై వైఎస్ షర్మిల మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో వర్షాలకు పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని, బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అంటూ వచ్చిన ఓ వార్తను ఆమె పోస్ట్ చేశారు. 'అవ్వ పెట్టదు.. అడక్కు తిననీయదు అన్నట్టే ఉంది కేసీఆర్ దొర తీరు.. రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలకు 5 లక్షల ఎకరాలలో పంటలను నష్టపోయారు రైతులు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి గత సంవత్సరం తప్పుకున్న రాష్ట్ర ప్రభుత్వం సొంత పంటల బీమా పాలసీని తీసుకొస్తాం అని గొప్పగా చెప్పినప్పటికీ ఇంతవరకు తీసుకురాలేదు. దీంతో రైతులకు అటు కేంద్రం బీమా వర్తించక.. ఇటు రాష్ట్ర బీమా దిక్కులేక కష్టాలు పడుతున్నారు.. రైతు నష్టాల పాలవుతున్నడు. ఇప్పుడైనా మేల్కోండి సీఎం సారు' అని షర్మిల ట్వీట్ చేశారు.

# దళిత బంధు పథకం ముఖ్య ఉద్దేశాలు ఇవి: సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్ , జులై 26:తెలంగాణ దళితబంధు కేవలం కార్యక్రమం కాదని.. ఉద్యమమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న 'దళిత బంధు' పథకంపై ప్రగతిభవన్‌లో అవగాహన సదస్సు కొనసాగుతోంది. హుజూరాబాద్ నియోజకవర్గ ఎస్సీ ప్రతినిధులతో సమావేశమైన సీఎం కేసీఆర్.. పథకం లక్ష్యాలు, అమలు, కార్యాచరణపై వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ప్రతినిధులు సాధించే విజయం మీదే.. యావత్ తెలంగాణ దళితబంధు విజయం ఆధారపడి ఉందన్నారు. పథకం విజయవంతానికి అందరూ దృఢ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఒక్కడితో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం.. భారత రాజకీయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చి విజయం సాధించినట్లు గుర్తు చేశారు. హుజూరాబాద్‌లో దళితబంధు పథకం విజయవంతం చేయాలని సూచించారు. పథకం అమలు ప్రభావం యావత్ తెలంగాణపై ఆధారపడి ఉంటుందని వివరించారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి నలుగురు చొప్పున, మున్సిపాలిటీలోని ఒక్కో వార్డు నుంచి ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళల చొప్పున మొత్తం 412 మంది ఎస్సీ పురుషులు, మహిళలు సదస్సులో పాల్గొన్నారు. వీరితోపాటు మరో 15 మంది రిసోర్స్ పర్సన్లు ఇలా.. మొత్తం 427 మంది సదస్సులో పాల్గొన్నారు. దళిత బంధు పథకం ముఖ్య ఉద్దేశం, పథకం అమలు, పర్యవేక్షణ, నిర్వహణతో పాటు పథకాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల మీద సీఎం కేసీఆర్ వీరికి అవగాహన కల్పిస్తున్నారు.



# సీఎం పదవికి రాజీనామా చేసిన యడియూరప్ప

కర్నాటక, జులై 26: కర్ణాటక సీఎం పదవికి రాజీనామా చేయనున్నట్లు యడియూరప్ప అధికారికంగా ప్రకటించారు. మధ్యాహ్నం గవర్నర్‌ను కలిసి రాజీనామా లేఖను యడియూరప్ప సమర్పించే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రిగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వాన్ని విజయవంతంగా ముందుకు నడిపినట్లు చెప్పారు.

కాగా, కర్ణాటకలో సీఎం మార్పు తథ్యమని గత కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే, దానిని సీఎం యడియూరప్ప ఖండించారు. అయితే, అధిష్ఠానం సూచన మేరకు నిర్ణయం తీసుకుంటానని ఇటీవల చెప్పారు. దీంతో ఇవాళ రాజీనామా చేశారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరదనీరు



హైదరాబాద్ , జులై 26:కర్ణాటక, మహారాష్ట్ర వంటి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుండటంతో శ్రీశైలం జలాశయానికి వరదనీరు భారీగా పెరిగింది. ముఖ్యంగా అలమట్టి, నారాయణపూర్, జూరాలకు వరద నీరు పోటెత్తడంతో జలాశయంలో కనిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ ఉంచుకుని వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఆ నీరు నేరుగా శ్రీశైలం జలాశయానికి చేరుకుంటోంది.

ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 4,05,416 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను.. ప్రస్తుతం నీటిమట్టం 863.7 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు. ప్రస్తుతం వంద టీసీఎంలకు పైగా నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. ఎగువ ఉన్న అన్ని ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండుకోవడంతో అధికారులు వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే కొద్ది రోజుల్లోనే ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# నల్ల మాస్కులు, హెల్మెట్లతో అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు..

పాట్నా, జులై 26: : బీహార్‌లో అసెంబ్లీలో ఆర్జేడీ ఎమ్మెల్యేలు నిరసన ప్రదర్శన చేపట్టారు. వర్షాకాల సమావేశాలు తొలి రోజు సందర్భంగా హెల్మెట్లు, నల్ల రంగు మాస్కులు ధరించి అసెంబ్లీకి వచ్చారు. మార్చి 23వ తేదీన అసెంబ్లీలో జరిగిన సంఘటనను నిరసిస్తూ.. ఆర్జేడీ ఎమ్మెల్యేలు నితీశ్ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. గత సమావేశాల్లో ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. నితీశ్ ప్రభుత్వ పాలన పట్ల భయంగా ఉందని, తమపై ఎక్కడ దాడి చేస్తుందో అన్న నేపథ్యంలో హెల్మెట్లు ధరించినట్లు ఆర్జేడీ ఎమ్మెల్యేలు తెలిపారు. సభ శాంతియుంగా సాగాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయని, కానీ ప్రజల కోసం అనేక నిరసన ప్రదర్శనలు చేపడుతామని, నిరసన చేపట్టేవారిని అసెంబ్లీలో కొడుతారా అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తెలిపారు.

# రైల్వే ప్రయాణికులకు శుభవార్త.. ప్లాట్‌ఫారాల టిక్కెట్ ధరలు తగ్గింపు

హైదరాబాద్ , జులై 26:కరోనా విజృంభణ సమయంలో పెంచిన ప్లాట్‌ఫారాల టిక్కెట్ ధరలను రైల్వేశాఖ తగ్గించింది. ఈ మేరకు సికింద్రాబాద్ డివిజన్‌లోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్లాట్‌ఫారం టికెట్ ధరలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రూ.50 ఉన్న ప్లాట్‌ఫారం టిక్కెట్ ధరను రూ.10కి తగ్గించింది. మరోవైపు చిన్న స్టేషన్‌లలో ప్లాట్‌ఫారం టిక్కెట్ ధరను రూ.10గా నిర్ణయించింది.

కరోనా కాలంలో వైరస్‌ను నియంత్రించేందుకు, ప్రజల రద్దీని తగ్గించేందుకు ప్లాట్‌ఫారం టిక్కెట్ ధరలను రైల్వేశాఖ రూ.50కి పెంచింది. తాజాగా అధికారులు అన్‌రిజర్వ్‌డ్ ఎక్స్‌ప్రెస్, సాధరణ రైళ్లను పునరుద్ధరించడంతో పెంచిన టిక్కెట్ ధరలను తగ్గించింది. ప్రయాణికుల సౌకర్యం, సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

# వందశాతం లక్ష్యం చేరిన 9రాష్ట్రాలు!




**పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సరఫరా,**
**పారిశుధ్యం విషయంలో సంపూర్ణ ఫలితాలు**
**66శాతం స్కూళ్లకు, 60శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు**
**కుళాయిల ద్వారా సురక్షితమైన నీరు సరఫరా..**
**అన్ని స్కూళ్లు, అంగన్ వాడీ కేంద్రాల చిన్నారులకు**
**సురక్షిత నీరు సరఫరా చేయాలన్నది ప్రధాని సూచన..**
**పదినెలల్లోనే 18 రెట్లు పెరిగిన నీటి కుళాయిల కనెక్షన్లు..**
**చిన్నారుల ఆరోగ్యానికి, పారిశుధ్యానికి**
**జలజీవన్ మిషన్ తో భారీ తోడ్పాటు..**

న్యూఢిల్లీ, జులై 26: కోవిడ్-19 వైరస్ మహమ్మారి సంక్షోభం నేపథ్యంలో, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు (ఆశ్రమశాలలు) తదితర సంస్థల్లోని చిన్నారుల సంక్షేమం, ఆరోగ్యంకోసం వారికి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు గత ఏడాది అక్టోబర్ 2వ తేదీన ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత, పదినెలలు కూడా గడవకుండానే ఎన్నో మెరుగైన ఫలితాలు లభించాయి. నీటి కుళాయిల కనెక్షన్లు ఏకంగా 18 రెట్లు పెరిగాయి. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉన్న 6.85 లక్షల పాఠశాలలకు (66శాతం) 6.80లక్షల అంగన్ వాడీ కేంద్రాలకు (60శాతం), 2.36లక్షల గ్రామ పంచాయతీలకు, కమ్యూనిటీ ఆరోగ్య రక్షణకేంద్రాలకు (69శాతం) తాగునీటి సరఫరా కల్పించారు.

ఆంధ్రప్రదేశ్, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కేరళ, పంజాబ్, సిక్కిం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవుల్లో కోవిడ్ మహమ్మారి సమస్య, లాంక్ డౌన్ ఆంక్షలతో పలు సార్లు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ రాష్ట్రాల్లో అన్ని పాఠశాలలు, గురుకుల విద్యా సంస్థలు, అంగన్ వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటి సరఫరాను ఏర్పాటు చేయగలిగారు. ఒక సారి పాఠశాలలు, గురుకుల విద్యా సంస్థలు మొదలవగానే,.. ఆయా సంస్థల్లోని చిన్నారులకు స్వచ్ఛమైన, సురక్షితమైన నీరు అందుబాటులోకి వస్తుంది కాబట్టి, వారికి మెరుగైన ఆరోగ్యం, పారిశుధ్యం అందించేందుకు వీలుంటుంది.

చిన్నారులకు కుళాయిల ద్వారా తాగునీటిని అందించేందుకు వీలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత ఏడాది సెప్టెంబరు 29వ తేదీన అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒక విజ్ఞప్తి చేశారు. ప్రతి పాఠశాలకు, అంగన్ వాడీ కేంద్రానికి ప్రాధాన్యతా ప్రాతపదికతో నీటి కుళాయిల కనెక్షన్లు అందించాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి కలలను సాకారం చేసే లక్ష్యంతో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ గత ఏడాది అక్టోబర్ 2న వందరోజుల అవగాహనా కార్యక్రమాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న చిన్నారులకు స్వచ్ఛమైన నీటిని అందించడానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై అవగాహన కల్పించడానికి ఆయన ఈ వందరోజుల కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలలకు గురుకుల విద్యాసంస్థలకు, అంగన్ వాడీ కేంద్రాలకు, గ్రామ పంచాయతీ భవనాలకు, ఆరోగ్య రక్షణ, సంక్షేమ కేంద్రాలకు సురక్షితమైన నీటిని అందించేలా తగిన తీర్మానాలు ఆమోదించేందుకు, అందుకోసం గ్రామసభలను నిర్వహించేలా చూసేందుకు జాతీయ జలజీవన్ మిషన్ (జె.జె.ఎం.) ఆయా రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తగిన తోడ్పాటును అందించింది.

పదినెలల వ్యవధి కూడా గడవకముందే ఈ కార్యక్రమం ఎన్నో మెరుగైన ఫలితాలను సాధించింది. దేశంలోని 6.85లక్షల పాఠశాలలకు, 6.80లక్షల అంగన్ వాడీ కేంద్రాలకు, 2.35 గ్రామపంచాయతీలు/కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తాగునీటికి, మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన కుళాయిలు సమకూరాయి. 6.18లక్షల పాఠశాలల్లోని మరుగుదొడ్లకు, మూత్రశాలలకు, 7.52లక్షల పాఠశాలల్లో విద్యార్థులు చేతులు శుభ్రపరుచుకునేందుకు నీటి సరఫరా అందుబాటులోకి వచ్చింది. ఇలా కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించడంతో చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, నీటి కాలుష్యంతో సోకే వ్యాధుల నిరోధానికి వీలు కలుగుతుంది.

దేశంలోని 91.9వేల పాఠశాలల్లో తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు, వినియోగించిన నీటిని శుద్ధి చేసేందుకు, వర్షపునీటి సంరక్షణకు చర్యలు తీసుకున్నారు. అలాగే 1.05 లక్షల పాఠశాలల్లో మురుగునీటి నిర్వహణా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. దీనితో నీటి లభ్యత మెరుగుపడటంతో పాటుగా, చిన్నారుల్లో నీటి పొదుపుపై తగిన అవగాహన ఏర్పడేందుకు, తాము పెరిగే దశలోనే నీటి నిర్వహణా పద్ధతులను గురించి తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది.

సురక్షితం కాని నీరు, అధ్వాన్న స్థితిలోని పారిశుధ్య పరిస్థితుల కారణంగా నీటి కాలుష్యంతో వచ్చే వ్యాధులకు చిన్నారులు గురవుతున్నారు. విరేచనాలు, అతిసారం, కలరా, టైఫాయిడ్ వంటి రుగ్మతల పాలవుతున్నారు. సురక్షితంగాని నీటిని తాగడం, అపరిశుభ్ర పరిస్థితుల కారణంగా తరచుగా వారు వ్యాధులకు గురికావడం వల్ల ఎదిగే దశలో ఆరోగ్యపరంగా ప్రతికూలతలు ఎదురయ్యే ఆస్కారం ఉంది. ఫ్లోరైడ్, భార లోహాలు వంటి వాటితో కలుషితమైన నీరున్న ప్రాంతాల్లో సదరు నీటిని దీర్ఘకాలం వినియోగించడం వల్ల తీవ్రమైన రుగ్మతలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల సురక్షితమైన తాగునీటిపై ప్రభుత్వం ప్రకటించిన అవగాహనా కార్యక్రమంలో భాగంగా, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలకు నిర్ణీత నాణ్యతా ప్రమాణాలతో కూడిన నీటిని కుళాయిల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.

కోవిడ్ వైరస్ మహమ్మారి నిరోధంకోసం చిన్నారులు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ కార్యకర్తలకు, సంరక్షకులకు తరచుగా చేతులు శుభ్రపరచుకోవడానికి 'పైపుల ద్వారా పరిశుద్ధమైన నీటిని' అందించవలసిన ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని శుద్ధమైన నీటిని అందించే కార్యక్రమాన్ని జలజీవన్ మిషన్ ముందుకు తీసుకెళ్తోంది. అన్ని పాఠశాలలకు, గురుకుల విద్యాసంస్థలకు, అంగన్ వాడీ కేంద్రాలకు సాధ్యమైనంత త్వరగా సురక్షితమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటోంది.

2019వ సంవత్సరం ఆగస్టు 15వ తేదీన జలజీవన్ మిషన్ కార్యక్రమం ప్రారంభించే నాటికి, దేశంలోని 18.98కోట్ల గ్రామీణ ఇళ్లలో 3.23 కోట్ల ఇళ్లకు (17శాతం ఇళ్లకు) మాత్రమే నీటి కుళాయిల కనెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అయితే, కోవిడ్ వైరస్ సంక్షోభం, లాక్ డౌన్ ఆంక్షలతో ఆటంకాలు ఎదురైనప్పటికీ, జలజీవన్ మిషన్ కార్యక్రమం ముందుకు సాగింది. దీనితో ఈ రోజుకు 7.80 కోట్ల ఇళ్లకు (41.14శాతం ఇళ్లకు) నీటి కుళాయిల ద్వారా నీటి సరఫరా సమకూరింది. గోవా, తెలంగాణ, అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరిలలోని గ్రామీణ ప్రాంతాల్లో వందశాతం ఇళ్లకు నీటి కనెక్షన్లు అందుబాటులోకి వచ్చాయి. దీనితో ఆ ప్రాంతాల్లో 'ప్రతి ఇంటికీ నీరు' అన్న లక్ష్యం సంపూర్ణంగా సాకారమైంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' నినాదం స్ఫూర్తికి అనుగుణంగా, దేశంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీటి కుళాయిల కనెక్షన్లు అందించాలని, ఈ విషయంలో 'ఎలాంటి మినహాయింపునకూ తావియ్యరాదని' జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని ముందుకు సాగిస్తున్నారు. ప్రస్తుతానికి దేశంలోని 74 జిల్లాల్లో, లక్షా 4వేల గ్రామాల్లో ప్రతి ఇంటికీ నీటి కుళాయి కనెక్షన్లు అందాబుటులోకి వచ్చాయి. జలజీవన్ మిషన్ కార్యక్రమం అమలుపై తాజా పరిస్థితిని, వివరాలను తెలుసుకోవడానికి జలజీవన్ మిషన్ డ్యాష్ బోర్డును thttps://ejalshakti.gov.in/jjmreport/JJMIndia.aspx లింకు ద్వారా సందర్శించవచ్చు.

ఇక నీటి నాణ్యత నమూనాల సేకరణ, పరీక్షల నిర్వహణ, ఫలితాలను పొందుపరచడం, వినియోగదారులకు పరీక్షల ఫలితాలను అందజేయడం వంటి వాటికోసం నీటి నాణ్యతా నిర్వహణా సమాచార వ్యవస్థ (డబ్ల్యు.క్యు.ఎం.ఐ.ఎస్.) పేరిట ఆన్ లైన్ పోర్టల్ కు రూపకల్పన చేశారు.


భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐ.సి.ఎం.ఆర్.) భాగస్వామ్యంతో ఈ పోర్టల్ రూపొందింది. ఒకవేళ ఏదైనా నీటి నమూనా కలుషితమైనదిగా పరీక్షల్లో నిర్ధారణ జరిగిన పక్షంలో, సత్వరం తగిన పరిష్కార చర్యలు తీసుకునేందుకు వీలుగా, పరీక్షా ఫలితం సమాచారాన్ని వెంటనే సంబంధిత అధికారులకు పంపించి వారిని అప్రమత్తం చేస్తారు. ఎవరైనా వినయోగదారుడు తన నీటి నమూనాను నమోదు చేసుకుని, సమీపంలో ఉన్న నీటి నాణ్యతా ప్రయోగ శాలను ఎంపిక చేసుకోవడానికి ఈ పోర్టల్ అవకాశం కల్పిస్తుంది. https://neer.icmr.org.in/website/main.php అనే వెబ్ లింక్ ద్వారా ఎవరైనా ఈ పోర్టల్ ను సందర్శించవచ్చు. ఈ ఏడాది జూలై 25వ తేదీ నాటికి దాదాపు 4.9లక్షల నీటి నమూనాలను నాణ్యతా పరీక్షలకోసం ఈ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు.

జలజీవన్ మిషన్ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన నీటి సరఫరా సదుపాయాల నిర్వహణా బాధ్యతను గ్రామ పంచాయతీలు, లేదా గ్రామ నీటి సరఫరా పారిశుధ్య కమిటీలు, పానీ సమితీలు చూసుకుంటాయి. జలజీవన్ మిషన్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించేందు జరుగుతున్న కృషికి యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యు.ఎన్.ఒ.పి.ఎస్. వంటి అభివృద&ృధి సంస్థలు కూడా దోహదపడుతున్నాయి. పాఠశాలల్లో నీటి పొదుపు, చేతులు శుభ్రపరుచుకోవడం వంటి అంశాలపై చిన్నారులకు అవి అవగాహన కల్పిస్తున్నాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2019 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భగా ఎర్రకోట బురుజునుంచి చేసిన ప్రకటన మేరకు జలజీవన్ మిషన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలవుతోంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికీ 2024వ సంవత్సరానికల్లా కుళాయిల ద్వారా నీటిని అందించాలన్న లక్ష్యంతో, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తూ వస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంకోసం మొత్తం రూ. 3.60లక్షల కోట్లను పెట్టుబడిగా కేటాయించారు.

# రామప్ప దేవాలయంలో కేక్ కట్ చేసిన మంత్రి


హైదరాబాద్ , జులై 26:కాకతీయుల కళా నైపుణ్యానికి నిదర్శనంగా 800 ఏళ్లక్రితం నిర్మించిన రామప్ప (రుద్రేశ్వరా) దేవాలయానికి ప్రపంచ స్థాయి (యునెస్కో) గుర్తింపు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రులు సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, తదితరులు రుద్రేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంరతం అక్కడ కేక్ కట్ చేశారు. రామప్ప దేవాలయానికి ప్రపంచ స్థాయి గుర్తింపు రావడంతో దేవాలయ పరిసర ప్రాంతాలు అన్ని తిరిగి పరిశీలించారు. రామప్ప చెరువు వద్ద మత్తడి ప్రాంతానికి వెళ్లి వరదని నియంత్రించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి సత్యవతి ఆదేశించారు. యునెస్కో నిబంధనల మేరకు దేవాలయాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేసేందుకు సీఎం కేసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



తెలంగాణలో ఉండే కాకతీయుల కట్టడాలకు ప్రపంచ గుర్తింపు తెచ్చే ప్రయత్నం సీఎం కేసిఆర్ ఉద్యమ కాలం నుంచే చేశారని తెలిపారు. నేడు దానికి ఫలితం లభించిందన్నారు. కాకతీయులు కట్టిన అద్భుతమైన శిల్ప సంపద తెలంగాణలో ఉందన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలు, రైతాంగం కోసం కాకతీయులు కట్టిన చెరువులను పునరుద్ధరించేందుకు మిషన్ కాకతీయ పేరుతో సీఎం కేసిఆర్ మహా కార్యక్రాన్ని చేపట్టారని గుర్తు చేశారు. యునెస్కో గుర్తింపు వల్ల పురాతత్వ శాఖ పరిధిలో ఈ దేవాలయం అద్భుతంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. దీనికి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రామప్ప పరిసర ప్రాంతాలని రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని తెలిపారు. రామప్పకు వచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు.

# అర్హులందరికి రేషన్ కార్డులు : మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి , జులై 26:అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా..మంత్రి మాట్లాడుతూ..అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. జిల్లాలో 3,302 మందికి తెల్లరేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. అందరికి కడుపునిండా తిండి పెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్డులపై సన్న బియ్యం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు ,పింఛన్లు, రైతుబంధు, దళిత బంధు ఇలా చెప్పుకుంటూ పోతే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజల మీద ఉన్న మమకారం అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



# మరో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం




హైదరాబాద్ , జులై 26:తెలంగాణలో వరుస ఆర్టీసీ బస్సు ప్రమాదాలు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. గత పది రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా రెండు ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురికాగా.. సోమవారం ఉదయం తూప్రాన్‌లో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో బస్సు రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. బస్సు ఆగిపోయిన సమయంలో 70 మంది ప్రయాణికులున్నారు. ఎవ్వరికీ ఎలాంటి హానీ తలెత్తకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# అందరికి అన్నం పెట్టేందుకే రేషన్ కార్డుల పంపిణీ



నిజామాబాద్, జులై 26:: అర్హులైన ప్రతి పేదవారికి ఆహార భద్రత కార్డులను అందజేస్తామని రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ గ్రామీణ మండలం, బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఆదివారం నూతన ఆహార భద్రత కార్డులను పంపిణీ చేశారు. బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడారు. ఆకలితో ఏ ఒక్కరూ ఉండకూడదు. పేదల కడుపు మూడు పూటలా నిండాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. సీఎం కేసీఆర్ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు పెన్షన్లు అందజేస్తున్నారని గుర్తు చేశారు. బాన్సువాడ పట్టణంలో నిర్మించిన మాతా శిశు దవాఖానలో గర్భిణులకు ఆధునిక సేవలు అందుతున్నాయని తెలిపారు. అదే విధంగా బాన్సువాడకు నూతనంగా నర్సింగ్ కళాశాల మంజూరు అయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమాన్ని కోరని ప్రతిపక్షాలను పట్టించుకోం



సూర్యాపేట, జులై 26: : పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఆకలిని పారద్రోలి.. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రజలను పట్టించుకోని ప్రతి పక్ష నాయకులను ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. వాళ్ల ఫోన్లను ట్యాప్ చేయాల్సిన అవసరం అంత కన్నా లేదన్నారు. ప్రతిపక్షాలు రాష్ట్రానికి యజమానుల్లా కాకుండా..ఇంకా బానిసలుగానే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణలో ప్రతి పేదవాడి కడుపు నిండాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. ఓట్ల రాజకీయం కోసమేప్రతి పథకాన్ని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలో మరో ఆదర్శ పథకంగా దళిత బంధు నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజారనీజక పాలనలో సబ్బండ వర్ణాల ప్రజలు భరోసాతో జీవిస్తున్నారని మంత్రి తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అర్హులైన 27 వేల మంది లబ్ధిదారులకు రేషన్ కార్డ్ లను పంపిణీ చేస్తున్నట్లు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణా రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఈ వారం ఎజెండాలో 'పెగాసస్'ను చేర్చలేదు: శశిథరూర్

న్యూఢిల్లీ, జులై 26:పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఐటీ విభాగానికి సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ శశిథరూర్ తప్పుపట్టారు. ప్రభుత్వం పెగాసస్ స్పై వేర్ సాయంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులపై నిఘా వేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. ఈ వారం చర్చించాల్సిన అంశాల ఎజెండాలో ఆ విషయాన్ని చేర్చలేదని ఆయన విమర్శించారు. అంతేగాక, దేశంలో ఇంధన ధరల పెరుగుదల, కొవిడ్ మహమ్మారిని కట్టడి చేస్తున్న తీరు, వాక్సినేషన్ విధానం తదితర అంశాలపై లోక్‌సభలో చర్చించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదని ఆయన ఆరోపించారు.

# మీరాబాయి చానుకు గోల్డ్ మెడల్ వచ్చే చాన్స్.. ఎలాగంటే



టోక్యో, జులై 26: ఒలింపిక్స్‌లో ఇండియాకు తొలి మెడల్ అందించిన మీరాబాయి చానుకు ఇప్పుడు గోల్డ్ మెడల్ దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. 49 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆమె సిల్వర్ మెడల్ గెలిచిన విషయం తెలిసిందే. ఈ ఈవెంట్‌లో చైనా వెయిట్‌లిఫ్టర్ ఝిహుయి హౌ గోల్డ్ గెలిచింది. కానీ ఆమెకు యాంటీ డోపింగ్ అధికారులు పరీక్షలు నిర్వహించనున్నారు. దీనికోసమే ఆమెను టోక్యోలోనే ఉండాల్సిందిగా ఇప్పటికే ఆదేశించారు. ఒకవేళ ఆమె డోప్ టెస్ట్‌లో విఫలమైతే మాత్రం రెండోస్థానంలో ఉన్న మీరాబాయికి ఆ గోల్డ్ మెడల్ దక్కుతుంది. ఈ ఈవెంట్‌లో చాను మొత్తం 202 కేజీల బరువు ఎత్తగా.. హౌ 210 కేజీలు ఎత్తి గోల్డ్ గెలిచింది. ఇండోనేషియా వెయిట్‌లిఫ్టర్ ఐసా విండీ కాంటికా బ్రాంజ్ మెడల్ సొంతం చేసుకుంది. ఇప్పటికే మీరాబాయి ఇండియాకు తిరుగు ప్రయాణమైంది. సోమవారం ఉదయం ఇండియా ఫ్లైట్ ఎక్కే ముందు ఎయిర్‌పోర్ట్‌లో కోచ్‌తో దిగిన ఫొటోను ఆమె ట్విటర్‌లో షేర్ చేసింది.

## మెడల్ గెలిస్తే.. 30 సెకన్లు మాస్క్ లేకుండా ఉండొచ్చు

టోక్యో, జులై 26:ఒలింపిక్స్‌లో పాల్గొనే అథ్లెట్లు, అధికారులు కరోనా బారిన పడకుండా నిర్వాహకులు కఠిన చర్యలే తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్లేయర్స్ ఆడేటప్పుడు తప్ప మిగతా అన్ని సమయాల్లో మాస్కులు ధరించే ఉండాలని స్పష్టం చేశారు. అయితే తాజాగా మెడల్ గెలిచిన వాళ్లకు మాత్రం ఓ బంపర్ ఆఫర్ ఇచ్చారు. వాళ్లు పోడియంపై నిల్చున్న సమయంలో ఫొటోలకు పోజులివ్వడానికి 30 సెకన్ల పాటు మాస్కులు తీసేసే అవకాశం కల్పించారు.

అయితే ఈ అవకాశాన్ని అథ్లెట్లు దుర్వినియోగం చేయొద్దని నిర్వాహకులు కోరారు. 30 సెకన్ల పాటే ఈ అవకాశం ఇస్తున్నట్లు సోమవారం ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ అధికార ప్రతినిధి మార్క్ ఆడమ్స్ వెల్లడించారు. ప్రస్తుతం అథ్లెట్లకు రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక నుంచి మెడల్స్ గెలిచిన వాళ్లు పోడియంపై నిల్చున్న సమయంలో నిర్వాహకులు చెప్పినప్పుడు ఫొటోల కోసం మాస్కులు తీయవచ్చు.

# లాంఛనంగా రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించిన మంత్రులు




భూపాలపల్లి, జులై 26: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ 53లక్షల రేషన్‌కార్డులు జారీ చేసి చేతులెత్తివేసిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం 34లక్షల కార్డులు జారీ చేసిందని తెలిపారు. రేషన్ షాపులకు దూరంగా ఉన్న గ్రామాలకు సబ్ సెంటర్ల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డుల జారీ ఓ చరిత్ర అని, ఒకే రోజు 3.09లక్షల కార్డుల జారీ చేసినట్లు పేర్కొన్నారు.

ఇందులో 8.65 లక్షల మందికి కొత్త కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. రేషన్‌కార్డులకు డిమాండ్ భారీగా పెరిగిందని, ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లపై దృష్టి పెట్టాలని సూచించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పేదవాడికి కడుపునింపడమే లక్ష్యంగా అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్‌కార్డు అందజేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం 12 లక్షల మందికి పెన్షన్లు అందిస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం 40లక్షలకు పెంచిందన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి అధ్యక్షతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం కొనసాగింది.

## పస్తులుండొద్దనే కొత్త రేషన్ కార్డులు: ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబ్‌నగర్, జులై 26: రాష్ట్రంలోని పేదలంతా మూడు పూటలా అన్నం తినాలని, ఒక్కరు కూడా పస్తుండకూడదనే విశాల హృదయంతో సీఎం కేసీఆర్ పేదలకు రేషన్ కార్డులు ఇస్తున్నారని ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదుర్‌లో లబ్ధిదారులకు 301 కొత్త రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహబూబాబాద్ నియోజకవర్గంలో సోమవారం 2194 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది ఉద్యోగాలు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అందరికి సహాయం చేస్తున్నదని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డును అందిస్తున్నామని వెల్లడించారు.

# రేషన్ కార్డులు పంపిణీ చేసిన మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, జులై 26:జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డులను మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన 1480 మంది లబ్ధిదారులకు ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ పిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రతి ఒక్కరికి కడుపు నిండా అన్నం పెట్టాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు.

అర్హులందరికి రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్. వెంకట్రావు, అదనపు కలెక్టర్ తేజస్ పవార్ నందలాల్, మున్సిపల్ చైర్మన్ కేసి.నర్సింలు, డిసిసిబి వైస్ చైర్మన్ కె.వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# కోనరావుపేట మండలంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

## -కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జులై 26:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ కొలనూర్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో కొలనూర్ గ్రామంలో 50 మంది పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో యువకులు చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి ఆది శ్రీనివాస్ హాజరై వారికి కండువా కప్పి పార్టీలోకి వారిని ఆహ్వానించారు

అనంతరం వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నూతన బాధ్యతలు తీసుకున్న తర్వాత యువత మరియు ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని,కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలు 2023 ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తామన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఫిరోజ్ పాషా,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం . జగన్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు రుక్మిణి,ఎల్లయ్య, ప్రభాకర్, యూత్ అధ్యక్షులు బొర్ర రవీందర్, మండల నాయకులు తిరుపతి యాదవ్, దేవరాజ్, హరీష్, గణేష్, దేవేందర్, కమలాకర్ భూమేష్, ఎల్లయ్య, సత్యం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన ఎంపీపీ, జెడ్పీటీసీ



రాజన్న సిరిసిల్ల, జులై 26:(నేటినిజం ప్రతినిధి ): జర్మనీ నుండి విచ్చేసిన అనంతరం వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు సోమవారం హైదరాబాద్ నుండి వేములవాడకు విచ్చేసి ముందు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తో పలుఅభివృద్ధి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు .అనంతరం ఎమ్మెల్యే రమేష్ బాబుకు వేములవాడ అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, జడ్పీటీసీ మ్యాక రవి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు

# నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్, జులై 26:: నిరుపేద సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. సోమవారం రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త పెన్షన్ల జారీకి, ఇండ్ల నిర్మాణాల కోసం ప్రక్రియ జరుగుతుందన్నారు. దళితులకు రూ.10లక్షలు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు.

కరోనాతో చాలా రాష్ట్రాల్లో పెన్షన్ల పంపిణీ నిలిపివేసినా.. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తెలంగాణలో పెన్షన్లు మాత్రం ఆపలేదన్నారు. కేంద్రం సహకరించకున్నా పేదల కోసం ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని నిలిపివేయలేదని చెప్పారు. అప్పులు తెచ్చి అన్నింటినీ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రూ.167కోట్లను రైతుబంధు కోసం రూరల్ జిల్లాలోనే ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రతీ గ్రామం అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో 1.87లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రూ.40లక్షల వ్యయంతో కరోనా నివారణకు నియోజకవర్గంలో హోమియోపతి మందులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ హరిత, ఎంపీపీ అనిమిరెడ్డి, తహశీల్దార్ సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీతో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ భేటీ

న్యూఢిల్లీ, జులై 26:హర్యానా గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన బండారు దత్తాత్రేయ సోమవారం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో గౌరవపూర్వకంగా కలిశారు. ప్రధాని ముందుగా గవర్నర్ బండారు దత్తాత్రేయ క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హర్యానా రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. హర్యానా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, రైతు సంక్షేమం పట్ల ప్రధాని మోదీ ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో గవర్నర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని ప్రధాని మోదీ అభిలషించారు. ప్రధాన మంత్రితో భేటీ తనకి మరింత స్ఫూర్తినిచ్చిందని గవర్నర్ బండారు దత్తాత్రేయగారు తెలిపారు.

# ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో సంస్కృతాన్ని ప్రవేశపెట్టి ,త్వరగా అమలుచేయాలి.

## సంస్కృతం ద్వారా సమాజం లో నైతికాభివృద్ధికి దారులు ఏర్పడుతాయి.



నిర్మల్, జులై 26:(నేటినిజం ప్రతినిధి): సర్వేజనా:సుఖినో భవంతు !అని నినదించే సంస్కృత భాష ను ఇంటర్మీడియట్ విద్యలో సెకండ్ లాంగ్వేజ్ ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనను త్వరలో అమలుచేయాలని నిర్మల్ జిల్లా సంస్కృత భాష అధ్యాపక సంఘం సభ్యులుకోరారు.సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో సంస్కృత అధ్యాపక సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృత భాషను ఇంటర్మీడియట్ ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని త్వరగా అమలుచేయాలని ఆదిశగా ప్రభుత్వం మరియు ఇంటర్ బోర్డ్ చర్యలు తీసుకోవాలని కోరారు.మనిషిని మనిషిగా తీర్చిదిద్దే సంస్కృత భాష యావద్ మానవజాతి శ్రేయస్సు కోసం నిలుస్తుందని అన్నారు.సమాజంలో అకృత్యాలను, అమానుషాలను నివారించేందుకు సంస్కృతం మాతృమూర్తిలా భోదిస్తుందని అన్నారు.సంస్కృతాన్ని సెకండ్ లాంగ్వేజ్ ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో ప్రవేశపెట్టాలని నిర్మల్ లోని ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ జాదవ్ పరుశురాం,ప్రభుత్వ బాలురబాలికల కళాశాలల ప్రిన్సిపాల్స్ రవికిరణ్ ,గంగాధర్ లకు ఈమేరకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంస్కృత అధ్యాపక సంఘం అధ్యక్షుడు బి.వెంకట్ ,ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి భూమేశ్,ఉపాధ్యక్షులు ఒరుగంటి నరహరి,కోశాధికారి కొత్తపల్లి కృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీరామ్.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో వ్యవస్థాపక మనస్తత్వాన్ని పెంపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లాభాపేక్షలేని GAME అలయన్స్ తో చేతులు కలిపింది!

హైదరాబాద్ , జులై 26:24 జూలై, 2021 – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ. గౌరవ విద్యా శాఖ మంత్రి, శ్రీ. ఆదిమూలపు సురేష్, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 9-12 వ తరగతి కొరకు నాయకఉన్నత్వం పాఠ్యప్రణాళిక ? వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం యొక్క చేర్పును ప్రకటించారు. కార్యక్రమ భాగస్వాములు అఫ్లతూన్, మేకర్ ఘాట్ మరియు రీప్ బెనిఫిట్ లతో పాటు లీడ్ ఇంప్లిమెంటర్ ఉద్యమ్ లర్నింగ్ ఫౌండేషన్ ను ఇందులోకి తీసుకురావడానికి సమగ్ర శిక్ష ఉంఓఇ అలయన్స్ తో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసింది.

ఈ కార్యక్రమాన్ని జూలై 20 న సమాగ్ర శిక్ష నిర్వహించిన కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ విద్యా శాఖ మంత్రి, శ్రీ ఆదిమూలపు సురేష్ ప్రవేశపెట్టారు మరియు ప్రారంభించారు. గౌరవ విద్యా శాఖ మంత్రి మాట్లాడుతూ "గౌరవనీయ ముఖ్యమంత్రి మరియు మా మొత్తం బృందం మన 45000 ప్రభుత్వ పాఠశాలలు వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తేవాలని కోరుకుంటుంది. ఆ వ్యత్యాసం యథాతథంగా లేదా మనం సాంప్రదాయకంగా చేస్తున్న వాటిని ద్వారా కాకుండా, భిన్నంగా ఆలోచించడం ద్వారా మరియు విద్యార్థులలో అవకలన ఆలోచనను ప్రేరేపించడం ద్వారా వస్తుంది. నాయకఉన్నత్వం వంటి కార్యక్రమాలు ఉపాధ్యాయులలో బలమైన ప్రేరణను రేకెత్తిస్తాయి, ముఖ్యంగా పైలెట్ లో పాల్గొనడానికి ఎంపికైన 42 మంది ఉపాధ్యాయులు భిన్నంగా ఆలోచించి ఈ కార్యక్రమానికి మార్గదర్శకులుగా మారేలా చేస్తుంది" అని అన్నారు.

దీర్ఘకాలిక లక్ష్యాల దిశగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా శాఖ కార్యదర్శి, శ్రీ బి. రాజ్శేఖర్, ఎఐఎ ఇలా అన్నారు, "వారు ఉపాధి దశకు చేరుకున్నప్పుడు, ఉద్యోగాన్ని అర్థించేవారుగా మారడానికి బదులుగా, ఉద్యోగ సృష్టికర్తలు అయ్యే విధంగా విద్యార్థులకు పునాది స్థాయి నుండి వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ ప్రయత్నాన్ని చేపట్టి ఉంఓఇ తో భాగస్వామ్యం ఏర్పరుచుకున్నందుకు విద్యా శాఖను నేను అభినందిస్తున్నాను. చిన్న వయస్సులోనే విద్యార్థులను వ్యవస్థాపక మనస్తత్వంపై దృష్టి పెట్టేలా చేయడం ద్వారా వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో ఎంతో సహాయపడుతుంది, ఇది వారు వ్యాపారాలను ప్రారంభించడంలో మరింత ఉత్సాహకరంగా పాల్గొనేలా మరియు సాధారణంగా సమాజానికి సహాయపడే ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సహాయపడేలా చేస్తుంది."

ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, ఉంఓఇ, అఇూ, ఎం. శ్రీనివాస్ రావు తన అంతిమ లక్ష్యాన్ని పంచుకున్నారు, "ఈ కార్యక్రమం యువతరం వ్యక్తిత్వ బలం, ఆత్మవిశ్వాసం, మరియు విశ్వసనీయ సంతులనం కలిగిన మనస్తత్వాన్ని పెంపొందించుకోవడం కొరకు 21 వ శతాబ్దపు నైపుణ్యాలను క్రియాశీలకం చేయడం ద్వారా, వారి సామర్థ్యాన్ని కొనసాగించడానికి సిద్ధంగా ఉండేలా చేసే లక్ష్యాన్ని కలిగి ఉంది. మనం సరిక్రొత్త సాధారణ స్థితి లోనికి అడుగుపెడుతుండగా, తీవ్రమైన పోటీ ఉన్న వృత్తిపరమైన ప్రపంచంలో, యువత ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగ సృష్టికర్తలుగా నిలబడటానికి వారికి సహాయపడటానికి వ్యవస్థాపక లక్షణాలను ఉపయోగించడం అత్యవసరం. ఈ దిశగా, వ్యవస్థాపకతను ఆకాంక్షించేదిగా మరియు యువతకు అత్యున్నతమైన వృత్తిపరమైన ఎంపికగా తీర్చిదిద్దే మా విధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వామ్యం కీలకం."

విద్యార్థుల కొరకు ఈ అవసరమైన మరియు నిరంతర అవసరాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారతదేశంలో వ్యవస్థాగత సామర్థ్యం మరియు సామర్థ్యాలను పెంపొందించడంలో నైపుణ్యం కలిగిన సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. పాఠ్య ప్రణాళిక తమ చుట్టూ ఉన్న పర్యావరణ వ్యవస్థలో ఉత్పన్నమవుతున్న అవసరాలను తీర్చడానికి విద్యార్థులకు సహాయపడుతుంది. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్షేత్రం చుట్టూ పరిశోధనలు చేసేలా, రిస్కులను అంచనా వేసి, స్వీకరించేలా, పరిష్కారాలను రూపొందించేలా, అవలంబించేలా మరియు వారి మార్గంలో ఎదురొచ్చే సవాళ్ళను పట్టుదలతో అధిగమించడం నేర్చుకునేలా చేస్తుంది.

ముఖ్యమైన వృత్తిపరమైన నిర్ణయాలు తీసుకునే సరిహద్దున ఉన్న ఈ యువకులు వారి కలల వృత్తుల కోసం ఆలోచనల అభివృద్ధి ద్వారా వారి సృజనాత్మక మరియు ఔత్సాహిక కోణాన్ని అన్వేషించగలరు.

# రైతువేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే చల్లా

వరంగల్ రూరల్, జులై 26: రైతుల మేలు కోసమే రైతులు వేదికలు నిర్మిస్తున్నామని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రైతు వేదికలతో సాగులో వచ్చే సాధక బాధలను ఇందులో చర్చించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని దామెర మండల కేంద్రంలో రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు వేదిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండలంలోని 14 గ్రామాలకు చెందిన 129 కుటుంబాలకు ప్రభుత్వం అందించిన కొత్త రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# చిరంజీవి ఉచిత ఆక్సిజన్ సేవలో భాగంగా 100 మంది కి ఆక్సిజన్ సిలిండర్లు అందజేత



రాజన్న సిరిసిల్ల, జులై 26:(నేటినిజం ప్రతినిధి): చిరంజీవి ఉచిత ఆక్సిజన్ సేవా ద్వారా జిల్లాలో 100 సిలిండర్లు అందజేస్తామని వేములవాడ మెగా ఫ్యామిలీ నిజయోకవర్గం ఇన్చార్జ్ మారం ప్రవీణ్ అన్నారు .చిరంజీవి ఉచిత ఆక్సిజన్ సేవలో భాగంగా సోమవారం రోజున వేములవాడ భగవంతరవు నగర్ చెందిన ముత్యపు లక్ష్మి అనే వృద్ధురాలు కరోనా తో భాదపడుతుండగా డాక్టర్ సూచన మేరకు ఆక్సీజన్ అవసరం అవసరమావగా వేములవాడ చిరంజీవి అభిమానులు మారం ప్రవీణ్ కుమార్ అరుణ్ తేజచారిను కాలువగా వారి కుటుంబ సభ్యులకు ఆక్సీజన్ కాన్సంట్రేటర్ మిషన్ ను ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వేములవాడ మెగాఫ్యామిలీ నియోజకవర్గ ఇంచార్జి మారం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చిరంజీవి చెప్పినట్టు ప్రణవయువు లేకుండా ఎవరి ప్రాణాలు పోకూడదు అనే నినాదంతో మొదలు పెట్టిన ఉచిత ఆక్సీజన్ సేవలు అందరు వినియోగించుకోవాలని ఇప్పటి వరకు జిల్లాలో సుమారు వందమంది కీ ఆక్సీజన్ సిలిండర్లను ఇవ్వడం జరిగింది అలాగే ఆక్సీజన్ కన్సంట్రేటర్ మిషన్లు నలపై మందికి ఇవ్వడం జరిగింది ఇంతటి సేవా చేసే భాగ్యం కలిగించిన చిరంజీవి, కొండ దేవయ్యకి కృతజ్ఞతలు తెలిపారు .

# నూతన రేషన్ కార్డులతో ఎంతో మేలు

వికారాబాద్, జులై 26:నూతన రేషన్ కార్డులతో లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తెలిపారు.

సోమవారం వికారాబాద్ పట్టణంలోని శివరాంనగర్ కాలనీలో లబ్ధిదారులకు చేసిన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు.

రేషన్ కార్డులు తీసుకున్న లబ్ధిదారులు వచ్చే నె ఆగస్టు నెల నుంచి రేషన్ బియ్యం తీసుకోవచ్చని తెలిపారు.

# రైలు ప్రయాణికులకు మరింత భద్రత.. ఇకపై అగ్ని నిరోధక రైల్వే కోచ్‌లు..!

న్యూఢిల్లీ, జులై 26: రైలు ప్రయాణికులకు మరింత భద్రత కల్పించడమే లక్ష్యంగా ఇండియన్ రైల్వేస్ మరో కీలక కార్యం మొదలుపెట్టింది. రైళ్లలో అగ్ని ప్రమాదాల సంఖ్యను తగ్గించడానికి అగ్ని నిరోధక (ఫైర్ రిటార్డెంట్) రైల్వే కోచ్‌లను అభివృద్ధి చేస్తున్నది. ఇండియన్ రైల్వే ప్రధాన కర్మాగారమైన కపుర్తలా రైల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ ఫైర్ రిటార్డెంట్ రైల్వే కోచ్‌లు తయారవుతున్నాయి. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఈ కోచ్‌ల పనితీరును పరిశీలించి.. అంతా అనుకూలంగా ఉంటే మిగతా కోచ్‌లను కూడా ఫైర్ రిటార్డెంట్ కోచ్‌లుగా మార్పు చేస్తామని కపుర్తలా రైల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ రవీందర్ గుప్తా తెలిపారు.

ఫైర్ రిటార్డెంట్‌లుగా మార్చిన రైల్వే కోచ్‌లలో ఎంసీబీలు, లైట్స్, టెర్మినల్ బోర్డులు, కనెక్టర్లు తదితర ఎలక్ట్రికల్ ఫిట్టింగ్‌ల కోసం మెరుగైన మెటీరియల్‌ను వినియోగిస్తున్నామని రవీందర్ గుప్తా చెప్పారు. రైల్ కోచ్ అభివృద్ధిలో కూడా పూర్తిగా ఫైర్ రిటార్డెంట్ ఫర్నీచర్‌నే వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కోచ్‌లలో చేసిన మార్పులవల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం దాదాపు ఉండదని గుప్తా తెలిపారు

# టేబుల్ టెన్నిస్ మూడో రౌండ్‌లో ఓడిన మనికా బాత్రా

టోక్యో, జులై 26: ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ రెండు రౌండ్లు దాటి సంచలనం సృష్టించిన ఇండియన్ ప్లేయర్ మనికా బాత్రా పోరాటం మూడో రౌండ్‌లో ముగిసింది.

ఆస్ట్రియా ప్లేయర్ సోఫియా పోల్కనోవా చేతిలో ఆమె 0-4తో దారుణంగా ఓడిపోయింది. ప్రత్యర్థి దూకుడైన ఆట ముందు మనికా నిలవలేకపోయింది. పోల్కనోవా 11-8, 11-2, 11-5, 11-7 తేడాతో సునాయాసంగా గెలిచింది. అరగంటలోపే ఈ మ్యాచ్ ముగియడం విశేషం.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.